

పోలీస్ కస్టడీకి బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి

నెల్లూరు (లీగల్),ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మైనింగ్ కేసులో బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని మూడు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇస్తూ నెల్లూరు ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి ఎస్.సరస్వతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పొదలకూరు పోలీసులు పెట్టిన అక్రమ మైనింగ్ కేసులో శ్రీకాంత్ రెడ్డి 12వ నిందితుడిగా ఉన్నారు. మరింత సమాచారం రాబట్టాల్సి ఉన్నందున 7 రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని నెల్లూరు రూరల్ డీఎస్పీ వేసిన పిటిషన్‌పై వాద ప్రతివాదనలు విన్నాక శ్రీకాంత్ రెడ్డిని ఈ నెల 12 నుంచి 14 వరకు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 14న విచారణ పూర్తయ్యాక కోర్టులో హాజరు పరచాలని న్యాయాధికారి పేర్కొన్నారు.

'ఉన్నత'మని ఊబిలోకి..

- గుట్టుగా సెక్స్ రాకెట్
- ఫ్యామిలీ పేరుతో అద్దెకు ఇళ్లు, అపార్ట్‌మెంట్లు
- ఉద్యోగం పేరుతో యువతులకు వల
- ఇతర ప్రాంతాల మహిళలతో కార్యకలాపాలు
- బ్యూటీపార్లర్, సెలూన్లలోనూ హైటెక్ వ్యభిచారం
- పోలీసులు దాడులు చేస్తున్నా ఆగని దందా
- వారికీ నెల మామూళ్లు

అన్నా మాది ఉమ్మడి కుటుంబం. పిల్లల చదువులు, ఆస్పత్రుల కోసం నెల్లూరుకు మా బంధువులు వస్తుంటారు. రెండు, మూడు రోజులు ఇక్కడే ఉంటారు. అందుకని నగరంలో ఇల్లు అద్దెకు తీసుకుంటున్నాం. అద్దె ఎంతయినా ఫర్వాలేదు. ప్రశాంత వాతావరణం కావాలి అంతే.

ఇంట్లో ఒంటరిగా ఉండి ఏం చేస్తావమ్మా. ఒకరి సంపాదనతో ఇల్లు ఎలా గడుస్తుంది. నాకు తెలిసిన వారి బ్యూటీపార్లర్ ఉంది. అక్కడ ఉద్యోగం ఇప్పిస్తాం. నెలకు ఎంతోకొంత ఇస్తారు. వేడినీళ్లకు చన్నీళ్లులా కుటుంబ అవసరాలకు నీ జీతం ఉంటుంది. ఆలోచించుకోమ్మా!'

- ఇంటి యజమానులకు, అమాయక మహిళలకు వేశ్యగృహ నిర్వాహకులు చెబుతున్న మాటలివి. వీరి మాటలు నమ్మి ఇల్లు అప్పగిస్తేనే.. బ్యూటీపార్లర్, సెలూన్లలో పనికి కుదిరితేనే నిలువునా మునిగిపోతున్నారు. పోలీసుల దాడుల్లో వారి బాగోతం వెలుగులోకి వస్తోంది.







నెల్లూరు(క్రైం) ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గుట్టు చప్పుడు కాకుండా సెక్స్ రాకెట్ నడుస్తోంది. నగరాలు, పట్టణాలకు దూరంగా కాకుండా నడిబొడ్డునే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఫ్యామిలీ పేరుతో ఇళ్లు, అపార్టుమెంట్లు అద్దెకు తీసుకుంటున్నారు. అనంతరం మా బంధువులంటూ ఇతర ప్రాంతాల నుంచి మహిళలను పిలిపించి వ్యభిచారం చేయిస్తున్నారు. నగరంలో సెలూన్ల మాటున కూడా హైటెక్ వ్యభిచారం జోరుగ నడుస్తోంది. పోలీసులు ఈ కేంద్రాలపై దాడులు చేస్తున్నా ఈ దందా కొనసాగిస్తున్నారు. ఒకచోట దాడులు చేస్తే మరో ప్రాంతానికి వెళ్లి నిర్వహిస్తున్నారు.

● మారిన ట్రెండ్

'అద్దె ఎంతైనా పరవాలేదు. మాకు ప్రశాంతమైన వాతావరణం కావాలి. మాది పెద్ద కుటుంబం. మా బంధువులు పనులపై వచ్చినప్పుడు మా ఇంట్లోనే భోజనం చేసి, నిద్రిస్తారు.' అంటూ ముందుగానే ఇంటి యజమానులను నమ్మిస్తున్నారు. అద్దె బాగా ఎక్కువ వస్తేచాలు మిగిలిన విషయాలు మాకెందుకు... అన్నట్లుగా ఇంటి యజమానులు సైతం పెద్దగా వారిని పట్టించుకోవడంలేదు. దీంతో అద్దెకు చేరినవారు అమాయకులుగా నటిస్తూ, చుట్టుపక్కల వారితో కలిసిపోతు న్నారు. విటులు ఇళ్లకు వస్తున్న సమయంలో మా బంధువులేనంటూ తమ కార్యకలాపాలను యధేచ్ఛగా నిర్వహిస్తున్నారు.

●సెలూన్, బ్యూటీ పార్లర్ల ముసుగులో...

సాధారణంగా పురుషులకు, మహిళలకు వేర్వేరుగా సెలూన్లు, బ్యూటీపార్లర్లు ఉంటాయి. ఒకవేళ ఇద్దరికీ కలిసి ఉంటే, వేర్వేరుగా క్యాబిన్లు ఏర్పాటు చేసి ఉంటారు. అయితే కొన్ని సెలూన్లు, బ్యూటీపార్లర్లు మహిళల కోసమే, పురుషుల కోసమేనంటూ బోర్డులు పెట్టి లోపల మాత్రం నిబంధనలకు విరుద్ధంగా మసాజ్, వ్యభిచారం చేస్తున్నారు. ఇటీవల ఈ వ్యాపారం జిల్లాలో జోరందుకుంది. నగరంలోని సెలూన్లలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాతోపాటు విటులను, కొంతమంది సెక్స్‌వర్కర్లను పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకున్న విషయం విదితమే.

● ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు...

కొంతమంది నిర్వాహకులు ఇతర ప్రాంతాల నుంచి మహిళలను జిల్లాకు పిలుస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు తెలంగాణ, రాజస్థాన్, పంజాబ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి సైతం యువతులను, మహిళలను తీసుకువచ్చి లేడీస్ హాస్టళ్లు, ప్రత్యేక రూమ్‌లోనూ ఉంచుతూ సెలూన్లు, బ్యూటీపార్లర్ల ముసుగులో దందా సాగిస్తున్నారు. అంతేగాక కొన్ని వ్యాపార కార్యాలయాల్లో వారిని ఉద్యోగులుగా చూపుతూ వ్యవహారం నడిపిస్తున్నారని సమాచారం. ఇక అపార్ట్‌మెంట్లు, నివాసాల్లోనూ ఇంకొందరు తమ కుమార్తెలు, కోడళ్లంటూ చెప్పుకుంటూ గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం చేయిస్తున్నారు. ఆయా రాష్ట్రాల నుంచి జిల్లాకు తీసుకువచ్చిన మహిళను బట్టి విటుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు, మూడు నెలలు మాత్రమే బయట నుంచి వచ్చిన వారిని ఉంచి, ఆ తరువాత మరో కొత్త బ్యాచ్‌ను జిల్లాకు తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది.


● ఉద్యోగాల పేరుతో ఎర

సామాన్య కుటుంబాల్లో చదువుకున్న, చదువుకోని యువతులు, మహిళలు తల్లిదండ్రులకో, భర్తకో అండగా ఉండేందుకు ఏదో ఒక పని చేయాలని ఆలోచిస్తుంటారు. అలాంటి వారిని ఈ ముఠా గుర్తించి, సెలూన్లు, బ్యూటీ పార్లర్లు, ఇతర కార్యాలయాల్లో ఉద్యోగాలు ఉన్నాయంటూ ప్రకటనలు ఇవ్వడం, జాబ్ కన్సల్టెంట్ల ద్వారా వారిని ఎంపిక చేసి ఈ మురికి కూపంలో దించుతున్నారు. లొంగనివారిని డబ్బు ఎరచూపి, లేదా బెదిరింపులకు దిగి బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారు.

● పోలీసులకు తెలిసినా..

ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో జరిగే ప్రతి విషయం సీఐ, ఎస్ఐ స్థాయి అధికారికి తెలియకపోయినా, ఎప్పటి నుంచో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మాత్రం తప్పనిసరిగా

- మిగతా 7లో..



వరదతో జలకళ సంతరించుకొన్న సోమశిల డ్యాం

40 టీఎంసీలకు చేరుకున్న సోమశిల

కర్నూలులో వర్షాలు ● పెన్నాకు రానున్న భారీ వరద

అనంతసాగరం ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటిమట్టం 40 టీఎంసీలకు చేరుకొంది. ఎగువ నుంచి సోమవారం 15,687 క్యూసెక్కుల నీరు కొనసాగుతుండగా ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 6,200, డెల్టాకు 1,850 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. అయితే కర్నూలు జిల్లాలో ఆదివారం రాత్రి అధిక వర్షపాతం నమోదైంది. దీంతో పెన్నానదికి వాగులు, వంకల నుంచి వరద చేరుతున్నట్లు అధికారులు గుర్తించారు. కడప జిల్లా సిద్ధవటం వద్ద ప్రవాహం పెరిగింది. ఇక శ్రీశైలంకు సుంకేసుల, జూరాల ప్రాజెక్టుల నుంచి 1.90 లక్షల క్యూసెక్కులు వస్తుండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు సరఫరా చేస్తున్న నీటిని 35 వేలకు క్యూసెక్కులకు పెంచారు. సోమశిలకు వస్తున్న ఇన్‌ఫ్లో మంగళవారానికి భారీగా పెరగవచ్చని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.

ఇరుకు గదులు.. 16 గంటల చదువు!

ఒత్తిడి తట్టుకోలేక నలిగిపోతున్న విద్యార్థులు

- అనుమతుల్లేకుండా ఇంటర్ కాలేజ హాస్టళ్లు
- ఫీజులు మాత్రం ఫుల్.. వసతులు నిల్
- చోద్యం చూస్తున్న అధికారులు
- తల్లిదండ్రులకు పుట్టెడు శోకం



ఆర్ఎస్ఆర్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాలు

జిల్లాలో ఇంటర్ కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు హాస్టళ్ల నిర్వహణలో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయి. అధికారికంగా 116 కళాశాలలు నిర్వహిస్తుండగా అనధికారికంగా ఈ సంఖ్య రెట్టింపులోనే ఉంటుంది. అపార్ట్‌మెంట్లు, ఇరుకు గదుల్లో హాస్టళ్లు నిర్వహిస్తూ ఫీజుల పేరుతో రూ.లక్షలు దండుకుంటున్న యాజమాన్యాలు విద్యపేరుతో మరింత ఒత్తిడి తెచ్చి విద్యార్థులను మానసికంగా కుంగదీస్తున్నారు. ఇది తట్టుకోలేక కొంతమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలోనే ఐదుగురు పిల్లలు ప్రాణాలు తీసుకున్నా అధికారుల్లో మాత్రం చలనం కరువయ్యింది.

నెల్లూరు(విద్య), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, హాస్టళ్ల పరిస్థితి చెరసాలలకే సాటిగా మారింది. తెల్లవారుజాము 4 గంటలకే నిద్రలేచి అర్ధరాత్రి 11 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. బాత్రూమ్‌ల వద్ద క్యూలో నిలబడతూ సిద్ధం కావడం, విరామం లేని తరగతులు, నాసిరక భోజనం, నిద్రలేని రాత్రులు విద్యార్థుల ఆరోగ్యం, మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యాజమాన్యం ఒత్తిళ్లు తట్టుకోలేక కుంగిపోతూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. రోజుకు 16 గంట పాటు చదువుతూ నీట్, ఐఐటీ, జేఈఈ లక్ష్యంగా నిర్వహించే ప్రత్యేక తరగతులతో ఇబ్బందులు పడుతూ నిత్యం తల్లిదండ్రులతో తాము ఇక్కడ ఉండలేమంటూ విలపిస్తున్నా పట్టించుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. కాగా, జిల్లాలో ఇంటర్ కళాశాలలకు మాత్రమే అనుమతులు ఉండగా, హాస్టల్స్ నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవు. నాణ్యమైన విద్యను అందిస్తామని తల్లిదండ్రులను నమ్మబలికి అనధికారికంగా హాస్టళ్లు నిర్వహిస్తూ రూ.లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు. చిన్న కిరాణా దుకాణం నడుపుకోవాలన్నా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని వేధించే అధికారులు ఇంటర్ కళాశాలల హాస్టళ్లను పట్టించుకోకపోవడం గమనార్హం. ఏదైనా సందర్భంగా విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంటే వాటిని బయటకు పొక్కనీయకుండా అన్ని విభాగాలను తమ కనుసన్నల్లో ఉంచుకుంటూ యధావిధిగా తిరిగి హాస్టల్స్ నిర్వహించడం జిల్లాలో పరిపాటిగా మారింది.

● ఆత్మహత్యలతో ఆందోళన

విజ్ఞాన కేంద్రాలుగా నిలవాల్సిన జూనియర్ కళాశాలలు మృత్యు నిలయాలుగా మారుతున్నాయి. కార్పొరేట్ ధనదాహం, మార్కుల కోసం ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు తమ ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. ఇటీవలి కాలంలో వరుస ఆత్మహత్యలతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంటున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదు. అనధికార హాస్టల్స్‌లో జరుగుతున్న ఈ మరణాలకు సంబంధించి యాజమాన్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఒకటి రెండు రోజులు హడావుడి సృష్టించడం తిరగి యధావిధిగా కళాశాలను, హాస్టల్‌ను నిర్వహించుకోవడం పరిపాటిగా మారింది. ఈ విద్యా సంవత్సరంలోనే ప్రైవేట్ జూనియర్ కళాశాలల అనధికార హాస్టళ్లలో ఐదుగురికి పైగా బలవన్మరణాలను పాల్పడడం బాధాకరం.

● ఇకనైనా మేల్కొంటారా!?

తాజాగా నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న ఆర్ఎస్ఆర్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని హేమశ్రీ బలవన్మరణానికి పాల్పడింది. హాస్టల్ గదిలోనే ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది. కళాశాల యాజమాన్యం దీన్ని గుట్టుచప్పుడు కాకుండా ఆసుపత్రికి తరలించి సాధారణ మరణంలా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు బాధిత తల్లిదండ్రులు ఆరోపించారు. దీనిపై పేరెంట్స్ కమిటీలు, విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఇప్పటికైనా ఇంటర్‌బోర్డు అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి అనధికారికంగా నిర్వహిస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

'ఆర్ఎస్ఆర్'పై కఠిన చర్యలు తీసుకోవాలి

నగరంలోని ఇస్కాన్‌సిటీలో ఉన్న ఆర్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన విద్యార్థిని హేమశ్రీ ఆత్మహత్యపై న్యాయ విచారణ జరిపి సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలని వామపక్ష ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం వీఆర్‌సీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో అనమతులు లేకుండా హాస్టల్స్ నిర్వహిస్తూ విద్యార్థుల మరణాలకు కారణమవుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఎస్ఆర్ కళాశాలలో జరిగిన విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని, యాజమాన్యంతోపాటు వీరికి వత్తాసు పలుకుతున్న ఇంటర్‌బోర్డు అధికారులపైనా కేసులు నమోదు చేయాలన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై ఐదోపట్టణ సీఐ కర్కశంగా వ్యవహరించి లాఠీచార్జి చేయడం అన్యాయమన్నారు. అనంతరం జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్, నరేంద్ర, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ, ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమారి, మస్తాన్‌బీ, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. అలాగే విద్యార్థి సంఘాలపై లాఠీచార్జి చేసిన ఐదోపట్టణ సీఐపై చర్యలు తీసుకోవాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆదిత్యసాయి డిమాండ్ చేశారు.

సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం

రైతులు ఆర్థికంగా స్థిరపడాలంటే పంటల దిగుబడులు గణనీయంగా పెరగాలి. మూసపద్ధతిని వీడి అత్యాధు నిక పద్ధతు లతో సాగు చేస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఇది గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే లక్ష్యంతో బిందు, తుంపర్ల సేద్యానికి ప్రాధాన్యత ఇస్తోంది. గత ప్రభుత్వం పక్కన పెట్టేసిన సూక్ష్మ సేద్యానికి ఊపిరి పోస్తోంది. 50 నుంచి 100శాతం రాయితీపై పరికరాలను అందిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తోంది. జిల్లాలో 2025-26కు సంబంధించి 6వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం లక్ష్యాన్ని నిర్దేశించింది.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఎస్సీ ఎస్టీ రైతులకే కాకుండా ప్రతి రైతుకు రాయితీపై పరికరాలను అందించేలా ఆదేశాలు జారీ చేసింది. 5ఎకరాలలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, మిగిలిన రైతులకు 90 శాతం రాయితీ ఇస్తోంది. అదేవిధంగా 5 నుంచి 10 ఎకరాలలోపు రైతులకు 70శాతం, 10 ఎకరాలపైన ఉన్న రైతులకు 50శాతం రాయితీపై పరికరాలు అందిస్తోంది. అదేవిధంగా తుంపర్ల సేద్య పరికరాలు అందరికీ 50 శాతం రాయితీ ఇస్తోంది. మామిడి, నిమ్మ, అరటి, బొప్పాయి, సపోటా, ఆయిల్‌పాం వంటి ఉద్యాన పంటలతోపాటు మినుము, పెసర, మల్బరీ, పూల తోటలు, కాయగూరలు వంటి ఆరుతడి పంటలన్నింటికి బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు రాయితీపై అందిస్తారు.



నిమ్మతోటలో ఏర్పాటు చేసిన సూక్ష్మ సేద్య పరికరం

రైతు సేవా కేంద్రాల్లో నమోదు

సూక్ష్మసేద్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. ఈ విధానం ద్వారా అవసరం మేరకే నీటి వినియోగం ఉండడంతో చీడపీడలు ఆశించే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో ఎరువులు, పురుగు మందులపై వెచ్చించే ఖర్చులు తగ్గుతాయి. కాబట్టి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బిం దు, తుంపర్ల సేద్య పరికరాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) వారి వివరాలను నమోదు చేసుకోవాలి. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, ఫోన్ నెంబర్లు ముఖ్యం. పూర్తి వివరాలకు ఆర్ఎస్‌కే సిబ్బందిని సంప్రదించండి.

- జి.శ్రీనివాసులు, పీడీ, ఏపీఎంఐపీ

● 3,557 మంది రైతులు రిజిస్ట్రేషన్

జిల్లాలో ఈ ఏడాదికి 6వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం సాగు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశం చింది. ఇప్పటికే 3557 మంది రైతులు 4402 హెక్టార్లలో పంటల సాగుకు అవసరమైన పరికరాల కోసం రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఇందులో ఇప్పటిదాకా 1067 మంది రైతులకు సంబంధించి 1475 హెక్టార్లలో ప్రాధమిక సర్వే పూర్తయింది. అదే విధంగా 280 మంది రైతులు 379 హెక్టార్లకు సంబంధించి వారి వాటా సబ్సిడీ నగదు చెల్లింపులు జరిగాయి. 177 మంది రైతులకు సంబంధించి 264 హెక్టార్లకు కలెక్టర్ ఆనంద్ నుంచి పరి పాలన అనుమతులు వచ్చాయి.



ఇంటింటా జెండా ఎగరాలి!

● 'హర్‌ఘర్ తిరంగా' ర్యాలీలో జేసీ కార్తీక్

- వివరాలు 8లో..

ప్రజలకు అందుబాటులో ఉంటా!

- భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి
- కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీ



సబ్ కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన దామెర హిమవంశీ

కందుకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ కలెక్టరుగా దామెర హిమవంశీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడున్న తిరుమాణి శ్రీపూజ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన సబ్ కలెక్టరు హిమవంశీ మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలు ఎప్పుడైనా తనను నేరుగా కలవవచ్చని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవటం జరుగుతుందని, ప్రజల పట్ల ఏ అధికారి అయినా ప్రభుత్వ ఉద్యోగి అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించినా, వారి సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలు సాధించటమే ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని పనిచేయటం జరుగుతుందని వివరించారు. కాగా, నూతన సబ్ కలెక్టరును పలువురు తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

14న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

కోవూరు, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించే ఈ జాబ్ మేళాలో 13 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9619
వెండి కిలో ధర	రూ. 117000
వెండి ఒక గ్రాము	రూ. 120.00

అవినీతి లెక్క తేల్చారు.. రికవరీ మరిచారు!

రాపూరు మండలంలో 'పొదుపు' నిధుల స్వాహా

రూ.2 కోట్ల మేర పక్కదారి పట్టినట్లు నిర్ధారణ

- యానాదులనూ వదలని అక్రమార్కులు
- భోక్తలపై ఇప్పటికీ చర్యల్లేవ్!
- పేదలకు దక్కని న్యాయం.. రికవరీలో తీవ్ర జాప్యం

పేద మహిళల ఆర్థిక స్వావలంభనకు ప్రభుత్వం అందించిన నిధులను పక్కదారి పట్టించారు. చదువు రాని పేదలేగా.. మనల్ని అడిగే ధైర్యమెక్కడిదే అన్న ధీమాతో దుర్వినియోగం చేశారు. రాపూరు మండలంలో ఉన్నతి, స్త్రీనిధి, సీఐఎఫ్ పథకాల కింద రూ.కోట్ల నిధులు తినేసినట్లు విచారణలో లెక్కలతో సహా తేలిపోయినా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో కిందిస్థాయి వీవోఏల నుంచి పైస్థాయి అధికారుల వరకూ పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. అయినా విచారణ ముగిసి నెలలు గడుస్తున్నా అక్రమార్కుల నుంచి పేదల సొమ్మును రికవరీ చేయడంలో అంతులేని అలసత్వాన్ని ప్రదర్శిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



ఉన్నతి పథకం కింద ఎస్సీ, ఎస్టీ మహిళలకు సబ్‌ప్లాన్ నిధులను రుణాలుగా మంజూరు చేశారు. అలానే స్త్రీనిధి పథకం కింద వడ్డీలేని రుణాలను ఇచ్చారు. అయితే పుస్తకాల్లో మాత్రం పలానా మహిళలకు రుణాలు ఇచ్చినట్లు రాసుకున్నారు తప్ప వాస్తవానికి వారికి రుణాలు ఇవ్వలేదు. వారి పేరుతో భోగస్ రుణాలను మంజూరు చేసి డీఆర్‌డీఏ సిబ్బందే ఆ నిధులను స్వాహా చేశారు. ఆఖరుకు యానాది సమాఖ్యను కూడా వదలకపోవడం గమనార్హం. యానాదులకు చెందాల్సిన నిధులను కూడా దిగమింగారు. చాలా కాలం నుంచి ఈ తంతు జరుగుతునా వైసీపీ ప్రభుత్వంలో అవినీతి పతాకస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి రాపూరులో తిష్ఠ వేసిన ఓ ఉద్యోగి ఈ మొత్తానికి సూత్రధారి అన్న ఆరోపణలున్నాయి. సంఘాల నిర్వహణకు ఇచ్చే సీఐఎఫ్ నిధులు కూడా మింగేశారు. పుస్తకాల్లో లెక్కలు చూపిస్తునా అకౌంట్లలో మాత్రం డబ్బులు లేవు.. ఏపీఎం, డీపీఎం, డీఆర్డీఏ కార్యాలయంలో పనిచేసే కొందరు అధికారులు అవినీతిపరులకు సహకరిస్తుండడంతో ఇంతకాలం ఈ భాగోతం వెలుగులోకి రాలేదని భోగట్టా.

రూ.2 కోట్లు స్వాహా

రాపూరు మండలంలోని పొదుపు సమాఖ్యల మాటున జరిగిన ఈ అవినీతి భాగోతం కలెక్టర్ ఆదేశాలతో బట్టబయలైంది. కొందరు స్థానికులు ఈ అవకతవకలపై గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. గతేడాది నవంబరులో డీఆర్‌డీఏ పీడీను విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో తొమ్మిది మంది అధికారులు, ఉద్యోగులను ఒక విచారణ కమిటీగా పీడీ నియమించారు. ఈ కమిటీ మూడు నెలల పాటు విచారణ జరపగా, అనేక అక్రమాలు వెలుగుచూశాయి. ప్రభుత్వ సొమ్మును వివిధ రూపాల్లో స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఆఖరుకు నోరులేని యానాదుల సొమ్మును కూడా తినేసినట్లు తేలింది. సుమారు రూ.2 కోట్ల వరకూ పేదలకు దక్కాల్సిన సొమ్మును కొందరు జేబుల్లో వేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఏడుగురు బాధ్యులైన ఉద్యోగులకు చార్జ్‌మెమోలు జారీ చేశారు. ఆ తర్వాత తదుపరి చర్యలు మరిచారు. అయితే విచారణ పూర్తయి ఇప్పటికి ఐదు నెలలు గడిచింది. ఇంత వరకూ రూపాయి కూడా అక్రమార్కుల నుంచి వసూలు చేయకపోవడం గమనార్హం.

రివకరీకి నోటీసులిచ్చాం

రాపూరు మండలంలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపాం. నిధుల దుర్వినియోగమైనట్లు గుర్తించాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం. నిధుల రికవరీకై వీవోఏలకు నోటీసులిచ్చాం.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ



భూ రీసర్వే ప్రక్రియ ముగిసింది

సుబ్బయ్య, తహసీల్దారు, కోవూరు

కోవూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పది రెవెన్యూ గ్రామాల్లోనూ భూ రీ సర్వే ప్రక్రియ పూర్తయిందని తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. రీ సర్వేలో లోపాల్ని సరిదిద్దడంతో పాటు 8 ఫిర్యాదులు పరిష్కరించినట్లు వివరించారు. కోవూరు, వేగూరులో నిర్వహించిన గ్రామ సభల్లో రైతులు తమ దృష్టికి తెచ్చిన 11 సమస్యలను పరిష్కరించామన్నారు.

? : భూ రీ సర్వేలో ఎన్ని సమస్యలు వచ్చాయి.. ఎలాంటివి ..

! : పది రెవెన్యూ గ్రామాలకు కలిపి 8 సమస్యలు మాత్రమే వచ్చాయి. విస్తీర్ణం, భూయజమానుల పేర్లు, సవరణ వంటి సమస్యలు వచ్చాయి. అన్నింటినీ పరిష్కరించాం.

? : గ్రామ సభల్లో ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించారు?

! : గ్రామ సభల్లో 11 ఫిర్యాదులు అందాయి. అన్నింటినీ పరిష్కరించాం. కోవూరు, వేగూరు గ్రామాల్లో మాత్రమే రెవెన్యూ రికార్డులు పూర్తయ్యాయి.

? : 'అన్నదాత సుఖీభవ' ద్వారా ఆర్థిక సాయం పొందుతూ మృతి చెంది న రైతుల కుటుంబాల్ని ఆదుకుంటున్నా రా

! : మండలంలో 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ఆర్థికసాయం పొందుతూ 210 మంది రైతులు మృతి చెందారు. వారి వారసులకు ప్రయోజనం కలిగేలా ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి రిపోర్టు పంపుతాం. ఆధార్‌కార్డుల్లో తప్పుగా నమోదైన 92 మంది రైతుల పేర్లను సవరించి పంపాం.

? : గిరిజనులకు ఆధార్ కార్డులు అందాయా

! : ఆధార్ కార్డులు లేని గిరిజనుల్ని గుర్తించేందుకు చర్యలు చేపట్టాం. 243 మంది గిరిజనులకు ఆధార్ కార్డులు లేవు. వారిలో 93 మందికి ఇప్పించాం.

? : నిత్యావసర సరుకుల సరఫరాపై చౌకదుకాణాలపై దృష్టి పెట్టారా

! : ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా 95 శాతం సరుకుల్ని పంపిణీ చేస్తున్నారు. 60 సంవత్సరాల పైబడిన 2600 మందికి ఇంటి వద్దకే వెళ్లి సరుకులు అందిస్తున్నారు.

బంగారు కుటుంబాల దత్తతకు ప్రాధాన్యం!



ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షులు మల్లికార్జునయాదవ్

ముత్తుకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి ఆదేశాలతో బంగారు కుటుంబాల దత్తతకు ప్రాధా న్యమిస్తున్నామని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లి కార్జునయాదవ్ తెలిపారు. పై నాపురం చిన్న గిరిజన సంఘం లో సోమవారం పక్కా ఇళ్ల ని ర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పీ4 కార్యక్రమంలో భాగంగా ఈ గిరిజన సంఘాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి దత్తత తీసుకున్నారన్నారు. 22 గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించామన్నారు. గిరిజనుల సంక్షేమానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా పాటుపడుతున్నారన్నారు. అంతకుముందు ముత్తుకూరులో కల్లుగీత కార్మికులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కల్లుగీత కార్మికుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు తోడ్పాటును అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పైనాపురం సర్పంచ్ కావలి విజయకుమార్, టీడీపీ నాయకులు నడవడి ముత్యంగౌడ్, బొలిగర్ల శ్రీనివాసులు, అక్కయ్యగారి ఏడుకొండలు, పట్టపు శోభన్, సుంకర శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● బంగారు కుటుంబాల దత్తతకు ముందుకు రండి

మనుబోలు: గ్రామాల్లో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకురావాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ముజీబున్నీసా కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం బంగారు కుటుంబాల దత్తతపై మార్గదర్శకులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలో 1669 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. అందులో 4320 మంది పేదలు ఉన్నారన్నారు. వీరిలో ఇప్పటివరకు 721 కుటుంబాలను 128 మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారన్నారు. ఇంకా 948 కుటుంబాలు తీసుకోవాల్సి ఉందన్నారు. మరికొంతమంది మార్గదర్శకులు స్పందించి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, మండల ప్రధాన కార్యదర్శి కరియావుల మధునాయుడు, యువ నాయకుడు వై. మహేంద్ర, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను సకాలంలో పరిష్కరించండి!



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్

మనుబోలు, ఆగస్టు 11 (ఆంధ్ర జ్యోతి): ఫిర్యాదుల దినోత్సవంలో బాధితుల నుంచీ అందే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి, వారి సమస్యలు పరిష్కరించాలని వీఆర్వోలు, ఆర్ఐలను డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 మంది భూ సమస్యలపై వినతులు ఇచ్చారని, వీటిని నిర్ణీత వ్యవధిలోనే పరిష్కరించాలన్నారు. రైతులు కోరినట్లు భూ రీ సర్వే చేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అరుణ్ బాబు, సర్వేయర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ బలహీనపడకుండా చూడాలి

● జేసీకి రైతు సంఘాల వినతి



జేసీ కార్తీక్‌కు సమస్యను వివరిస్తున్న తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమ నాయుడు

వెంకటాచలం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్‌కు ఇష్టానుసారం కట్ట బలహీనపడేలా రంధ్రాలు పెట్టి నీటిని వివిధ పరిశ్రమలకు తరలించేందుకు సిద్ధమైనట్లు తమ దృష్టికి వచ్చిందని, రిజర్వాయర్‌ను బలహీన పర్చకుండా రైతుల అంగీకారంతో సింగిల్ పైప్ లైన్ సిస్టం ద్వారానే నీటిని సరఫరా చేసేలా నిర్ణయం తీసుకోవాలని తెలుగు రైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శి రావూరి రాధాకృష్ణమ నాయుడు కోరారు. నెల్లూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఆయకట్టు రైతులతో కలిసి జేసీ కార్తీక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బ్రిటీష్ హయాంలో నిర్మించిన సర్వేపల్లి రిజర్వాయర్ కింద 17,500 ఎకరాలు సాగులో ఉన్నాయన్నారు. సర్వేపల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తున్నందున నీటి అవసరం ఉందన్నారు. చివరి ఆయకట్టు రైతులు నష్టపోకుండా రిజర్వాయర్ కట్టను బలహీనపర్చకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సోమిరెడ్డి ఆదేశించారన్నారు. పరిశ్రమలు విడివిడిగా పైప్ లైన్లు వేసుకోవడం వల్ల రిజర్వాయర్ కట్టకు తూట్లు పడతాయని, భారీ వర్షాలు వస్తే కట్ట కోతకు గురై గ్రామాలకు వరద ముప్పు సంభవించే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నేతలు చల్లా నాగార్జున రెడ్డి, శ్రీనితారెడ్డి, రవినాయుడు, నిక్కుదల రమేష్, దొడ్డక మురళి, ఈదర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

1010 రకం ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోండి

ఉమ్మడి జిల్లాలో 1010 రకం ధాన్యాన్ని రైస్ మిల్లర్లు, సివిల్ సప్లైస్ అధికారులు కొనుగోలు చేయలేమని చెబుతున్నారని, వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో జేసీ కార్తీక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. యడగారు పంట మరో 15 రోజుల్లో చేతికి అందుతుందని, కొనుగోలు కేంద్రాలు తెరిచి ధాన్యాన్ని వెంటనే సేకరించేలా నిర్ణయం తీసుకోవాలన్నారు.

రాజంపేటకు రెండు బస్ సర్వీసులు

రాపూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ డిపో నుంచి రాజంపేటకు మంగళవారం నుంచి రెండు కొత్త బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసులు ఉదయం 6.20, 7.10 గంటలకు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ రెండు సర్వీసులు రోజుకి 8 ట్రిప్పులు తిరుగుతాయని, ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కాలుష్య బాధితులను ఆదుకోవాలి

ముత్తుకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కాలుష్యంతో అల్లాడుతున్న ప్రజలను ఆదుకోవాలని కోరుతూ ముత్తుకూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు దుంపల ఏడుకొండలు మాట్లాడుతూ పంటపాలెం పంచాయతీలో 13 పామాయిల్ పరిశ్రమల ద్వారా వెలువడే కాలుష్యం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు బియ్యం, రూ.3వేల నగదు, మత్స్యకారేతర ప్యాకేజీ బ్యాలెన్స్ పంపిణీ చేయాలన్నారు.

లక్ష బిల్వార్చన

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో సోమవారం ములూరుకు చెందిన భక్తు రాలు నాగభూషణమ్మ లక్ష బిల్వార్చన పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజలో 20 మందికి పైగా అర్చకులు పాల్గొన్నారు.

ఉచితంగా సబ్బుల పంపిణీ

పొదలకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చెన్నారెడ్డిపల్లి గిరిజన కాలనీలో ప్రజలకు సంతూర్ సబ్బులను ఆ సంస్థ సెక్రటరీ అహ్మద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి శివజ్యోతి, ఏఎన్ఎం ఎస్‌కె సాజిదా, 104 డీ ఈవో రహంతుల్లా, ఆశా కార్యకర్త లక్ష్మీ ప్రస న్న, అమ్మవారిపాలెం హెచ్‌ఎం నౌరాజీ, ఉపాధ్యాయుడు హజరతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి ప్లాటినం గ్రీన్ బిల్డింగ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు

ముత్తుకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రమైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్లాటినం గ్రీన్ బిల్డింగ్ అవార్డు లభించింది. విజయవాడలో సోమవారం జరిగిన గ్రీన్ ఆంధ్ర సమ్మిట్ 2025లో ఐజీబీసీ ప్లాటినం సర్టిఫికేషన్‌ను ప్రదానం చేశారు. ఎస్ఈఐఎల్ ఎనర్జీకి ప్రాజెక్టు-1లో ఉన్న కంపెనీ అడ్మిన్ భవనం ప్రస్తుత గ్రీన్ బిల్డింగ్ రేటింగ్ సిస్టమ్‌లో 80శాతం కంటే ఎక్కువ రేటింగ్‌ను సాధించింది. ఎస్ఈఐఎల్ ఎనర్జీ సీఈవో జనమేజయ మహాపాత్ర కంపెనీ అడ్మిన్ సీనియర్ మేనేజర్ నాగేశ్వరరావు, సిబ్బందిని అభినందించారు.

విద్యుత్ స్తంభాలపై తీగల తొలగింపు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చి, జొన్నవాడ మార్గంలో విద్యుత్ స్తంభాలపైన ప్రమాదకరంగా అల్లుకున్న మొక్కలు, తీగలను తొలగించారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'అల్లుకుపోతాం...అడిగేదెవరు..?' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. కానుగచెట్లు కాలనీ, పెనుబల్లి శివారు, రైస్ మిల్లు సమీపంలోని స్తంభాలు, విద్యుత్ వైర్లుకు అల్లుకునిన్న మొక్కలు, తీగలను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో స్వాతంత్ర్య వేడుకలు

● వేదికను పరిశీలించిన టీడీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూల్‌లో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్య అతిథిగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరు కానుండడంతో సోమవారం తహసీల్దారు వేంకటేశ్వర్లు, ఎంపీడీఓ నారాయణరెడ్డి, కమిషనర్ బాలకృష్ణ, ఎంఈఓలు పాఠశాలను పరిశీలించారు. టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్ శివకుమార్ రెడ్డి, నేతలు కోడూరు కమలాకర్ రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి ఏర్పాట్లపై చర్చించారు. వారి వెంట టీడీపీ నాయకులు మోర్ల మురళి, ఎంవీ. శేషయ్య, బత్తల హరికృష్ణ, సుబ్రమణ్యంనాయుడు తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

రాపూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై ఎస్ఐ వెంకట రాజేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు వాడకం వల్ల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ అధికారి సాయికిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

కారు బోల్తా : ఒకరి దుర్మరణం

● ముగ్గురికి తీవ్రగాయాలు

దగదర్తి(బిట్రగుంట), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సున్నంబట్టి సమీపంలో కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై సోమవారం ఉదయం కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు..



కారు సీటులోనే మృతి చెందిన పినపాటి రత్నరాజు

బెంగళూరుకు చెందిన పినపాటి రత్నరాజు(83), అతని భార్య విజయకుమారి, కోడలు సుహాసిని, అల్లుడు వంశీలు తెనాలిలో బంధువు మృతి చెందగా అక్కడికి వెళ్లేందుకు ఆదివారం రాత్రి బెంగళూరు నుంచి కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో సున్నంబట్టికి 2 కిలోమీటర్ల దూరంలో వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముందు సీట్లో కూర్చుని ఉన్న రత్నరాజు సీట్లోనే మృతి చెందాడు. అతని భార్య విజయకుమారి, కోడలు సుహాసిని, కారు నడుపుతున్న అల్లుడు వంశీకి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ జంపాని కుమార్ సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రత్నరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మురుగు కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి):స్థానిక సబ్బారెడ్డినగర్‌లో సోమవారం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ సంతోష్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మినీ లారీ కింద పడి ఆవు...

ఉదయగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గండిపాళెం మార్గంలో పెట్రోల్‌బంకు సమీపాన సోమవారం మినీలారీ కింద పడి ఆవు మృతిచెందింది. సేకరించిన వివరాల మేరకు, గండిపాళెం వైపు నుంచి ఉదయగిరిలోకి మినీ లారీ వస్తున్నది. ఆ సమయంలో పెట్రోల్‌బంకు సమీపాన రెండు ఆవులు పోట్లాడుకుంటూ మినీ లారీ కింద పడ్డాయి. ఈ ప్రమాదంలో ఒక ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. మరో ఆవు లారీ కింద ఇరుక్కుపోయింది. గమనించిన స్థానికులు ఆ ఆవును బయటకు తీశారు. కాగా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



మినీ లారీ కింద పడి మృతిచెందిన ఆవు

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

● రూ. 7లక్షల ఆస్తి నష్టం ● నాయుడుపల్లిలో ఘటన

మనుబోలు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లి పంచాయతీలోని నాయుడుపల్లి (మడ)లో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు అగ్నికి ఆహుతైంది. బాధితుల వివరాల మేరకు... రావూరి వెంకటసుబ్బయ్య నాయుడు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం వ్యవసాయ పనులకోసం రూ. 2 లక్షల నగదు తెచ్చి బీరువాలో ఉంచాడు. పనుల నిమిత్తం సుబ్బయ్యనాయుడు, ఆయన భార్య కురిచెర్లపాడుకు వెళ్లారు. స్తంభం నుంచి సర్వీస్ వైరుకు షార్ట్ సర్క్యూట్ అయింది. పెద్దఎత్తున మంటలు వ్యాపించడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దుస్తులు, నాలుగు సవర్ల బంగారం, రూ. 2 లక్షల నగదు, వస్తు, వంటసామాగ్రి, 14 బస్తాల ధాన్యం కాలి బూడిదయ్యాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. రూ. 7లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధిత రైతు వెంకటసుబ్బయ్య వాపోయాడు.



నాయుడుపల్లి(మడ)లో దగ్ధమైన ఇంటి పైకప్పు

లైంగికదాడిపై డీఎస్పీ విచారణ

సంగం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంగం పోలీస్ స్టేషన్‌లో నమోదైన లైంగిక దాడి కేసును డీఎస్పీ వేణుగోపాల్ సోమవారం విచారించారు. సంగం - కలిగిరి రహదారిలోని మామిడి తోటలో ఈనెల 3న రాత్రి తోట యజమాని యేసోబు, కొంతమంది యువకులతో మందు పార్టీ చేసుకున్నారు. ఈ క్రమంలో మద్యం మత్తులో యేసోబు తోటలో కాపలాగా ఉన్న మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆ మహిళ మరుసటి రోజు తన భర్తతో కలిసి నెల్లూరు ఎస్పీకి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో విచారించిన సంగం పోలీసులు యేసోబుపై లైంగిక దాడి కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణ నిమిత్తం డీఎస్పీ తోట వద్దకు వెళ్లి బాధితురాలిని సాక్షులను విచారించారు. ఈ విచారణలో ఆయనతోపాటు ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● బంగారం, వెండి వస్తువుల అపహరణ

కావలిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ఇస్లాంపేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిందని బాధితురాలు ఎస్‌కే.రసూల సోమవారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. ఇస్లాంపేటలో ఉంటున్న రసూలా ఇంటికి తాళం వేసి రెండు రోజుల క్రితం ఒంగోలుకు వెళ్లింది. ఆదివారం రాత్రి తిరిగి ఇంటికి రాగా తలుపు తాళం పగల గొట్టి ఉండటంతో ఇంట్లో పరిశీలించగా బీరువాలోని రూ.65,000 విలువ గల బంగారు, వెండి వస్తువులు అపహరించుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ జమాల్‌వలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	212
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 510

భూ ఆక్రమణపై చర్యలు తీసుకోండి : సీపీఎం

నెల్లూరు రూరల్, ఆగస్టు, 11, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల పంచాయతీ మట్టెంపాడు గ్రా మంలో సర్వే నెం.3 లోని ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతోందని, దానిని కాపాడాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ నా యకులు జనార్దన్, మాదాల వెంకటేశ్వర్లు, ఆలూరు తిరుపాలు తది తరులు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామాని కి సంబంధంలేని ఓ వ్యక్తి ఇప్పటికే 20 ఎకరాలు ఆక్రమించి అమ్మేశారని తెలి పారు. మరో 30 ఎకరాలలో కొబ్బరి మొ క్కలు నాటారని చెప్పారు. ఇక్కడ 145 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ ఆయన లెక్కచేయడం లేదని, రెవెన్యూ, పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరో పించారు. జిల్లా ఉన్నతాధికా రులు జోక్యం చేసుకుని భూములను కాపా డాలని, పేదల సాగులో ఉన్న 110 ఎకరాలకు పట్టాలివ్వాలని కోరారు.

న్యూస్ బాక్స్

నేడు కాత్యాయనీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా కాత్యాయనీ వ్రతం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులందరూ తరలిరావాలని కోరారు.

● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో వైభవలక్ష్మీ పూజ, పూలంగి సేవ, సాయంత్రం సౌభాగ్య కుంకుమ పంపిణీ జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు మేగు షణ్ముఖరావు ఓ ప్రకటనలో తెలిపారు.

రైల్వే కోర్టు న్యాయాధికారి బదిలీ

నెల్లూరు(లీగల్), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మొదటి తరగతి స్పెషల్ రైల్వే కోర్టు న్యాయాధికారిగా పని చేస్తున్న పాలమంగళం వినోద్‌ను కర్నూలు జిల్లా జీన్ ప్రిన్సిపల్ జూనియర్ న్యాయాధికారిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వినోద్ నెల్లూరు రైల్వే కోర్టుకు రెండున్నరేళ్ల క్రితం వచ్చారు. న్యాయాధికారిగా విశేష సేవలు అందించారు.

నేడు శంకరాచార్యులపై ఆధ్యాత్మిక ప్రవచనం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6.30గంటలకు వర్ధమాన సమాజంలో ఆధ్యాత్మిక ప్రవచనం జరగనుంది. కైలాస శంకరుడే కాలడి శంకరుడు అనే అంశంపై గుడ్లదొన వెంకట సాయి ఆంజనేయవరప్రసాదరావు ప్రవచిస్తారని నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతనాపరులు, సాహితీ ప్రేమికులు హాజరుకావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మండ పాల వీధిలో ఉన్న రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. సోమవారం ఉదయం సహస్ర శంఖ క్షీరాభిషేకం, 108 సార్లు అష్టోత్తర పారాయణం జరిగాయి. సాయంత్రం రమాదేవి శిష్య బృందం సంగీత కచేరీ ఆకట్టుకుంది. ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఉదయం 9గంటలకు స్వామివారి ఊరి ఉత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

అక్రమ మైనింగ్‌తో అనర్థం

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ కారణంగా పర్యావరణం దెబ్బతిని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అక్రమ మైనింగ్ పోరాట సమితి అధ్యక్షుడు రాజేష్‌కుమార్ తెలిపారు. సోమవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ మైనింగ్‌ను అడ్డుకోకుంటే అక్కడ ప్రజలు జీవించే పరిస్థితి ఉండదన్నారు. కలెక్టర్, పర్యావరణ నియంత్రణ మండలి, మైనింగ్ శాఖలు తనిఖీ చేసి నోటీసులు ఇచ్చినా మైనింగ్ కొనసాగుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పోరాట సమితి గౌరవాధ్యక్షుడు పీ శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, శివకుమార్, పాల్‌రాజ్, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదులో వాస్తవ సమాచారం ఉండాలి

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ-క్రాప్ డేటా కోసం డిజిటల్ సర్వేలో తప్పులు లేకుండా వాస్తవ సమాచారాన్ని నమోదు చేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 100% భూ కమతాల్లో పంటల సాగు ఉన్నా, లేకపోయినా సర్వే చేసి, వివరాలన్నీ తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సోమవారం మంగళగిరిలోని వ్యవసాయశాఖ ప్రధాన కార్యాలయం నుంచి ఈ-క్రాప్, డిజిటల్ అప్లికేషన్‌పై జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, పట్టుశాఖల అధికారులు, రైతుసేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ-క్రాప్ నమోదులో వ్యవసాయ సహాయకుల ఇబ్బందులను ఏపీ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు దృష్టికి తీసుకెళ్లారు.

‘ఉన్నత’మని ఊబిలోకి!

(5వ పేజీ తరువాయి)

తెలుస్తుంది. కానీ కొందరు వ్యభిచార గృహాల నిర్వాహకుల వద్ద భారీ మొత్తంలోనే నగదు తీసుకుంటూ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకురావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినా, కొందరు రాజకీయ నేతలు, విలేకర్ల ఒత్తిళ్లకు తలొగ్గి వారు సైతం మిన్నకుండిపోతున్నారు. స్థానికులు సమాచారం ఇచ్చినప్పుడు మాత్రం విధిలేని పరిస్థితుల్లో దాడులు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ దందాను అరికట్టాల్సిన అవసరం ఉంది.





మబ్బులతో సరి.. చినుకు రాలదే మరి !

నల్లని మేఘాలు నెల్లూరు నగరాన్ని ఊరిస్తున్నాయేగానీ కరుణించి వర్షించడం లేదు. కరి మబ్బులు కమ్ముకోగానే వాతావరణం చల్లబడుతోంది. అది చూసి జనం వాన పడబోతోందని ఆశపడుతున్నారు. ఇంతలోనే ఆ మేఘాలు మాయమై సూరీడు చుర్రుమనిపిస్తున్నాడు. దీంతో ప్రజలు ఉసూరుమంటున్నారు. ఇటీవల నగరంలో తరచూ ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

పూడిక తీశారు.. వదిలేశారు..!

● కాలువల పక్కనే సిల్ట్ ● ఆరిపోయినా తరలించని యంత్రాంగం
● తిరిగి కాలువల్లోకి వ్యర్థాలు



జగదీష్‌నగర్‌లో తీసి వదిలేసిన పూడిక

నెల్లూరు, (జడ్పీ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మురుగు కాలువల్లో పూడిక తీస్తున్న కార్పొరేషన్ యంత్రాంగం, ఆ పూడికను కాలువల పక్కనే వదిలేస్తోంది. కొంతకాలానికి ఆ పూడిక మళ్లీ కాలువల్లోకి చేరుతోంది. దీని వల్ల కాలువల్లో మురుగు పారుదల లక్ష్యం నెరవేరడం లేదు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువలన్నింటిలో పూడికలు తీసి ముంపు ఏర్పడకుండా పాలకులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా స్పెషల్ డ్రైవ్ పేరుతో నగరంలోని ప్రధాన పంట కాలువలతోపాటు అన్ని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. ప్రధాన కాలువల్లో ఇంజనీరింగ్ విభాగం అధ్వర్యంలో దాదాపు రూ.3కోట్లతో టెండ ర్లు పిలిచి యంత్రాలతో పూడిక తీస్తున్నారు. కాలువల్లో పూడిక తీయడం వరకు బాగానే ఉన్నా తీసిన పూడికను అక్కడే వదిలే యడం విమర్శలకు తావిస్తోంది. కోట్లాది రూపాయిలు వెచ్చించి తీసిన పూడికను బయటకు తరలించటంపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. సాధారణంగా పూడిక తడిగా ఉంటుంది కావున తీసిన వెంటనే తరలించరు. అందుకని కాలువల పక్కనే గుట్టలుగా పోస్తారు. మూడు, నాలుగు రోజుల్లో అది పూర్తిగా ఆరిపోయాక వాహనా లతో బయట ప్రాంతాలకు తరలిం చాల్సి ఉంటుంది. అయితే ఈ పనులను ఎక్కువగా స్థానిక కార్పొరేటర్లకే అప్పగించటంతో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కాలువల్లో పూడిక తీసి నెల రోజులు గడుస్తున్నా ఆ సిల్ట్ తరలించడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురు స్తుండటంతో కాలువల పక్కన గుట్టలుగా పోసిన పూడిక మళ్లీ కాలువల్లోకి చేరుతోంది. ఇప్పటికైనా నగర పాలకులు, అధికారులు స్పందించి పూడికను ఎప్పటికప్పుడు తరలించాల్సిన అవసరం ఉంది.



ఏస్‌వీజీఎస్ కాలేజీ ప్రాంతంలో రోడ్డుపైనే వదిలేసివున్న పూడిక దిబ్బలు

ప్రధానికి ఎంపీ వేమిరెడ్డి సన్మానం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో సోమవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలిశారు. మోదీని శాలువాతో సత్కరించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ఆపరేషన్ సిందూర్ ద్వారా మన దేశ సైనిక పరాక్రమాన్ని చాటారని కొనియాడారు. మోదీ నాయకత్వంలో దేశం మరింత పురోగమిస్తుందని వేమిరెడ్డి పేర్కొన్నారు.



ప్రధాని మోదీని శాలువాతో సత్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కాలువల్లో పూడిక తీయిస్తాం



అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న వర్షాకాలానికి వరద సమస్య లేకుండా కాలువల్లో పూడిక తీయిస్తామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నగరవాసులకు హామీ ఇచ్చారు. అపార్టుమెంట్ బాట కార్యక్ర మంలో భాగంగా సోమవారం కావేరినగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లోని అపార్టుమెంట్ వాసులతో సమావేశం నిర్వహించారు. తమ పరిధిలో చేయాల్సిన పనులు ఏవీ ఆలస్యం కావని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చేజర్ల మహేష్, కోక్లస్టర్ ఇన్‌చార్జి ఖాదర్‌బాషా, టీడీపీ అధ్యక్షుడు దారా మల్లి తదితరులు పాల్గొన్నారు. కాగా, రూరల్ నియోజకవర్గంలో పీఏసీఎస్ పదవులు పొందిన వారు సోమవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తే ఊరుకోవద్దు

● కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఆగస్టు, 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మద్రాసు బస్టాండ్, ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తుంటే ఊరుకోవద్దని కార్పొరేషన్ కమిషనర్ నందన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పారిశుధ్య పనుల పరిశీలనలో భాగంగా ఆ ప్రాంతానికి వెళ్లిన ఆయన రోడ్డు మార్జిన్ వ్యాపారులతో మాట్లాడారు. రోడ్లను ఆక్రమించి వ్యాపార సామగ్రి ఉంచడం వల్ల వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోందని చెప్పారు. ఆక్రమణలు తొలగించాలని, పదేపదే రోడ్డు ఆక్రమణలకు పాల్పడే వారికి జరిమానా విధించాలని ఉద్యోగులను ఆదేశించారు. అనంతరం కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న ఆయన నగర వాసుల నుంచి వినతులు స్వీకరించారు. వాటని నిర్దేశిత కాల వ్యవధిలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.



వ్యాపారికి సూచనలిస్తున్న కమిషనర్ నందన్

నగరంలో కార్డన్ సెర్చ్

● అణువణువు గాలించిన పోలీసులు



కార్డన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం వేకువ జామున పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. బోడిగాడితోట, అహ్మద్ నగర్, బర్మాషెల్ గుంట ప్రాంతాల్లో సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది 100 మందితో 350 ఇళ్లను అనువణువు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నగర డీఎస్పీ పీ సింధుప్రియ మాట్లాడుతూ అసాంఘిక శక్తులకు అడ్డుకట్టవేయడంతోపాటు సామాన్య ప్రజల్లో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెంచేందుకు ఈ ఆపరేషన్ నిర్వహించామని చెప్పారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 35 బైక్‌లు, 2 ఆటోలు స్వాధీనం చేసుకున్నామని, అనుమానితుల వేలిముద్రలు సేకరించామని తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై ప్రజలు స్థానిక పోలీసులకుగానీ, డయల్ 112, 100 నెంబర్లకుగానీ సమాచారం అందించాలని కోరారు. కార్డన్ సెర్చ్‌లో నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాష్టమి ఉత్సవాలకు గుంజ ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీ నగర్‌లో కృష్ణాష్టమి ఉత్సవాలకు సోమవారం గుంజ ప్రతిష్ఠ జరిగింది. ముఖ్య అతిథిగా కేవీడీవీ ప్రసాద్‌రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిరంజీవి యూత్ అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పాతికేళ్లుగా బాలాజీ నగర్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాలుగు రోజులు ఈ కార్యక్రమం జరుగుతుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, ప్రభాకర్, ఆకుల హనుమంతరావు, రవి, రమేష్‌రాజు, ఉదయ్, అమ్మినేని తిరుపాల్‌రెడ్డి, దుర్గా తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లో కృష్ణాష్టమి సందర్భంగా గుంజ ప్రతిష్ఠ

వెల్లంటిలో బాలుడి అదృశ్యం

● రెండు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

నెల్లూరు రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలంలోని పాతవెల్లంటి గ్రామంలో సోమవారం ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. అయితే పోలీసులు రెండు గంటల్లోనే ఆ బాలుడిని గుర్తించి తల్లిదం డ్రులకు అప్పగించారు. సేకరించిన సమాచారం మేరకు.. గ్రామంలో నివసించే పాదర్తి నారాయణ, రమణమ్మల కుమారుడు మనోజ్ (6) ఊళ్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. సోమవారం బడికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బ్యాగ్‌తో బయటకు వచ్చాడు. అయితే 10 గంటల సమయంలో మనోజ్ స్కూల్‌కు రాలేదు ఎందుకంటూ పాఠశాల ఉపాధ్యాయు డు ఇద్దరు పిల్లల్ని బాలుడి ఇంటికి పంపారు. దీంతో తల్లిదండ్రులు గ్రామంలో వెతుకులాట ప్రారంభించారు. ఎంత వెతికినీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో సాయంత్రం 5 గంటల సమయంలో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గుంజి వేణు తన బృందంతో కలిసి గ్రామంలో గాలించారు. డ్రోన్ల సహాయంతో ఊరంతా జల్లెడపట్టారు. బాలుడు పంట పొలాల్లో ఉన్నట్లు గుర్తించి అక్కడకు చేరుకుని మనోజ్‌ను తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే బాలుడు పొలాల్లోకి ఎందుకు వెళ్లాడు?, ఎవరితో వెళ్లాడనే వివరాలు తెలియాల్సి ఉంది.



తల్లి చెంతకు చేరిన బాలుడితో పోలీసులు, గ్రామస్థులు

నారాయణ ఆసుపత్రి ఆన్‌వీల్స్ వాహనాల ప్రారంభం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 11 (ఆంధ్ర జ్యోతి) : నారాయణ ఆసుపత్రి ఆన్‌వీల్స్ వాహ నాల ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అం దించేలా రెండు కోట్ల రూపాయల విలువైన వాహనాలను పురపాలక శాఖ మంత్రి పొంగూ రు నారాయణ ప్రారంభించారు. నగరంలోని జెండావీధి వద్ద సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఈ వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ తాళ్లపాక అనూరాధ, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్లపై రూల్స్ విడుదల

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలపై సాంకేతిక విద్యాశాఖ కొత్త రూల్స్ విడుదల చేసింది. ‘ఏపీ పాలిటెక్నిక్ అడ్మిషన్ల నియంత్రణ, రాష్ట్ర స్థాయి సాంకేతిక విద్యాసంస్థల నిబంధనలు-2025’ పేరుతో ఈ రూల్స్ రూపొందించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకూ 1988లో ఇచ్చిన 146 జీవో ఆధారంగానే ప్రతి సంవత్సరం పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా వచ్చిన మార్పులకు అనుగుణంగా ప్రతి ఏడాదీ సవరణలు ఇస్తున్నారు. ఇకపై ప్రతిసారీ సవరణల అవసరం లేకుండా కొత్త రూల్స్ జారీచేశారు. పాలిసెట్ నిర్వహణ, పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లకు ప్రస్తుతం ఉన్న నిబంధనలే యథావిధిగా అమలవుతాయి. పాలిసెట్, అడ్మిషన్లకు ఆన్‌లైన్ విధానం కొనసాగుతుంది.

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి

పీ4తో ఆధునికీకరణకు చర్యలు : మున్సిపల్ మంత్రి నారాయణ ● పలు సంఘాల నాయకులతో చర్చలు

నెల్లూరు (సిటీ/సాంస్కృతికం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నగరంలోని పలు ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, అందుతున్న విద్య, అందుబాటులో ఉన్న సేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడు తూ వచ్చే జూన్ నాటికి నగరంలోని 13 ఉన్నత పాఠశాలలను ఆధునీకరిస్తామని ప్రకటించారు. పీ4 పద్ధతిలో నగరంలోని 54 పాఠశాలలను విడతల వారీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. వీఆర్ స్కూల్లో ప్రస్తుతం అత్యధిక శాతం మంది పిల్లలు సర్వేపల్లికాలువ, పెన్నాఆనకట్ట, జాఫర్‌సాహెబ్ కాలువకట్లపైన ఉన్నవారి కుటుంబాల్లోనుంచి వచ్చిన వారేనన్నారు. గోల్డ్ మర్చంట్, క్లాత్ మర్చంట్, లారీ ఓనర్స్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్లతో మాట్లాడుతున్నామని, వారి సహకారంతో మరిన్ని పాఠశాలలు ఆధునీకరిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డీఈవో బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, తాళ్ళపాక అనురాధ, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు. కాగా, పీ4 కార్యక్రమంలో భాగంగా పాఠశాలల ఆధునీకరణకు సంబంధించి మంత్రి సోమవారం జైన్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నేతలతో భేటీ అయ్యారు. పాఠశాలల ఆధునీకరణకు సహకరిస్తామని ఆయా సంఘాల నాయకులు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మూలాపేట బాలికోన్నత పాఠశాలను డీఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్, ఆర్ఎస్ఆర్ఎం హైస్కూల్‌ను ఎంపీ వీపీఆర్ దత్తత తీసుకున్నా రని, పనులు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు. అలాగే, రెడ్డి ల్యాబ్స్ జీవీకే ప్రసాద్, ఎన్ఆర్ఐ ఉదయభాస్కర్, ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సతీమణి సంధ్యా, డాక్టర్ అనిల్, జైన్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కూడా స్కూల్స్‌ను ఆధునీకరించేందుకు ముందుకొచ్చినట్లు చెప్పారు. క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాతా వెంకట కిషోర్‌కుమార్ మాట్లాడుతూ బాలాజీనగర్‌లోని మల్లెల సంజీవయ్య స్కూల్ ఆధునీకరణకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ మంత్రి నారాయణ ఆదేశాలతో టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సోమవారం పలు సంఘాల వారిని కలిశారు. కార్యక్రమంలో నుడా మాజీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, 6వ డివిజన్ అధ్యక్షుడు కొండా ప్రవీణ్, నెల్లూరు డిస్ట్రిక్ట్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ముంగర నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, కిషోర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, మల్లికార్జున, సురేంద్ర, శేషారెడ్డి పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ



శివయ్యా.. ఆదుకోవయ్యా!

వరికుంటపాడు పంచాయతీ పరిధి జంగంరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కొండప్రాంతంలో మైనింగ్ తవ్వకాల అనుమ తులను రద్దు చేయాలని సోమవారం ఆందోళనకారులు గ్రామంలోని శివాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లి, ఆంధ్రావారిపల్లి నుంచి ప్రజలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని 'శివయ్యా.. నువ్వే మాకు దిక్కయ్యా'.. అంటూ శివుడ్ని వేడుకున్నారు. తాము సాగిస్తున్న పోరాటాలు ఫలించేలా ఆశీర్వదించాలని కోరారు. కాగా పోలీసు మాత్రం ఆలయాలు, చర్చిల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి, బహిరంగ ప్రచారం చేసుకోవద్దని ఆందోళనకారులను హెచ్చరించారు.

- వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి)

ధాన్యం రంగు మారుతోంది!

కనిగిరి రిజర్వాయర్ పరిధిలో ఇటీవలి కాలంలో వరి ధాన్యం రంగు మారుతోందని సోమవారం ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు గుర్తించారు. కోవూరు పరిసర ప్రాంత పొలాల్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు మధుసూదన్, పరమశివ, శ్రీలక్ష్మి పరిశీలించారు. మాట్లాడుతూ రంగుమారుతున్న గింజలున్న పొలంలో ప్రొపికేన్ జోల్ 150 మిల్లీ లీటర్ల ద్రావకాన్ని నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. వారి వెంట వ్యవసాయాధికారులు అనిత, రజని ఉన్నారు.



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు



రంగుమారిన వరిగింజలు

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

చిరుజల్లులు.. పెద్ద మడుగులు



సంగం మండలం దువ్వూరు మిట్టపాళెం ప్రధానవీధిలో వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. సిమెంట్ రోడ్డు వేసి డ్రైనేజీ నిర్మించలేదు. దీంతో వర్షపునీటితో పాటు ఇళ్లలోని మురికినీరు వెళ్లేందుకు మార్గం లేక సిమెంట్ రోడ్డు పైనే నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు ఆ నీటిలోనే నడిచి వెళ్లాల్సి వస్తున్నది. పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

18 నుంచి బ్యారన్ల రిజిస్ట్రేషన్

- ఇక నుంచి మూడేళ్లకొకసారి ప్రక్రియ

మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి): పొగాకు బ్యా రన్లను ఈ ఏడాది నుంచి మూడేళ్లకు ఒకసారి రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు డీసీపల్లి వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 2025-26 పంట కాలానికి సంబంధించి ఎఫ్‌సీవీ పొగాకు గిరాకీని, ప్రస్తుతం రైతుల వద్ద నిల్వలను దృష్టిలో ఉంచుకొని 1,420 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతించామన్నారు. బ్యారన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 18 నుంచి అక్టోబరు 27వరకు నిర్వహించనున్నామని ఆయన వివరించారు. నవంబరు 7వరకు అపరాధ రుసుం రూ.100, నవంబరు 19వరకు రూ. 400 చెల్లిస్తే దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఒకసారి రిజిస్టర్ అయిన బ్యారన్‌ను మూడేళ్లవరకు మరొకరిపేరుపై బదిలీ చేయబోమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని లీజుదారులు కూడా గమనించాలన్నారు. 2025-26 పంటకాలానికి 7.25ఎకరాల్లో సాగు చేసి, పండించిన 3,665 కిలోల పం టను మాత్రమే అమ్మకానికి అనుమ తించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు అందినట్లు ఆయన తెలిపారు.

ఈపీఎఫ్ డెత్ క్లెయిమ్‌లకు ప్రత్యేక డ్రైవ్

- ఫిర్యాదుల కోసం ప్రత్యేక నెంబరు
- రీజినల్ కమిషనర్ రవితేజ

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఈపీఎఫ్ డెత్ క్లెయిమ్‌ల పరిష్కరం కోసం సెప్టెంబరు చివరి వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఈపీఎఫ్ కడప రీజినల్ కమిషనర్ రవితేజ కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈపీఎఫ్‌వో సభ్యులకు, యాజమాన్యాలకు, పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా డెత్ క్లెయిమ్‌ల కోసం ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, చిత్తూరు తదితర జిల్లాల పరిధిలోని ఈపీఎఫ్ సభ్యుల, నామినీలు డెత్ క్లెయిమ్‌లకు సంబంధించిన వివరాలు, ఫిర్యాదుల కోసం 9491138280 నెంబర్‌ను కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు. ఈ డ్రైవ్‌తో అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవచ్చని, వా ట్సాప్‌లో సందేశం పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా ఈపీఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



నులిపేద్దాం!

విద్యార్థి దశలో ఎక్కువ మంది పిల్లలను బాధించే ఆరోగ్య సమస్యల్లో ప్రధానమైనది నులి పురుగుల సమస్య. వారి శారీరక ఎదుగుదలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో నులిపురుగుల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు సార్లు నివారణ చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో డీ వార్మింగ్ కార్య క్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించనుంది.

- చిన్నారుల్లో నులిపురుగుల సమస్య
- రక్తహీనత, పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు
- నిర్మూలిస్తేనే ఎదుగుదలకు ప్రయోజనం
- నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినం
- జిల్లాలో 5.75 లక్షల మంది విద్యార్థులకు మాత్రల పంపిణీ
- పాఠశాలలు, కళాశాలల్లో అమలు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పలు వ్యాధులకు కారణమైన నులిపురుగులు విద్యార్థులను తీవ్రంగా కుంగదీస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. ప్రస్తుత జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లల్లో నులిపురుగుల సమస్య తీవ్రంగా ఉందని తెలియచేసింది. దీని కారణంగా రక్తహీనతకులోనై పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. పౌష్టికాహార లోపం, బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వాంతులు, అతిసార వంటి సమస్యలు కూడా ఏర్పడడంతో వీరిలో శారీరక, మానసిక ఎదుగుదల మందకొడిగా సాగుతుందని తెలియ చేసింది. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టలేకపోవడం, చిన్న వ్యాధులకే ఇంటి పట్టున ఉండాల్సిన పరిస్థితి ఉండడం, దీర్ఘకాలం బడికి సెలవు పెట్టాల్సి రావడంతో వీరి విద్యా ప్రమాణాలు కుంటు పడుతున్నాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో ఒకే మాత్రతో చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచిం చిన మేరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో బడిపిల్లల్లో నులి పురుగుల నివారణకు చర్యలు చేపట్టింది



ఆల్‌బెండజోల్ మాత్రలు

జిల్లా వ్యాప్తంగా అమలు



డీ వార్మింగ్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా చేపడుతున్నాం. గుర్తించిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులందరితో ఆల్‌బెండజోల్ మాత్ర మింగిస్తాం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు 6,33,386 మాత్రలు వచ్చా యి. ఇప్పటికే వాటిని విద్యా సంస్థలకు పంపిణీ చేశా ము. రెండేళ్లలోపు చిన్నారులకు అరమాత్రను పొడిచేసి మింగించాల్సి ఉంటుంది. మూడు నుంచి 19 ఏళ్ల వారితో ఒక మాత్రను చప్పరించి మింగిచేలా అన్నీ ఏర్పాట్లు చేశాం. జిల్లాలో మొత్తం 5.75 లక్షల మంది చిన్నారులకు ఈ మాత్రలు వేస్తున్నాము.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

1 నుంచి 19 ఏళ్ల వరకు...

నులి పురుగుల నివారణకు ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసున్న వారితో అధికారులు అల్ బెండజోల్ మాత్రలు మింగించనున్నారు. ఇందుకోసం జిల్లాలో 5,75,806 మంది విద్యార్థులను గుర్తించారు. మొత్తం 2594 ప్రభుత్వ పాఠశాలలు, 811 ప్రైవేట్ స్కూళ్లలో ఈ కార్యక్రమం జరగనుంది. అలాగే 146 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల్లోనూ, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ వంటి కళాశాలల్లోనూ, 2912 అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ విద్యార్థులతో మధ్యాహ్న భోజనం తర్వాత మాత్ర మింగించేలా ఏర్పాట్లు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సమన్వయంతో ఈ డీవార్మింగ్ కార్యక్రమాన్ని మూడు రోజులు అమలు చేస్తున్నారు. ఈ మాత్రల వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యులు అందుబాటులో ఉంటారు.



వైద్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధికారుల ఆకస్మిక తనిఖీ

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పలు ప్రైవేటు ఆసుపత్రులను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో వైద్య బృందం నగరంలోని రెయిన్‌బో, క్రెస్ట్, రమాదేవి. శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ, అపెక్స్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. వాటిలో రికార్డుల ను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రతీ ఆసుపత్రికి ప్రభుత్వ రిజిస్ట్రేషన్, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక, బయో మెడికల్ వేస్ట్ మెనేజ్‌మెంట్ అనుమతి తప్పని సరిగా ఉండాలని సూచించారు. వైద్య చికిత్సల ఫీజుల వివరాలతో పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. క్షయ వ్యాధి అనుమానితులు ఎవరైనా ప్రైవేటు ఆసుపత్రులకు వస్తే దగ్గరలో ఉన్న ప్రభుత్వ కఫం కేంద్రానికి పంపించాలని సూచించారు. వారికి వైద్య పరీక్షల్లో క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆరు నెలలు ఉచిత మందులు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్షయ నివారణ సిబ్బంది తలసీరామ్, హరీష్, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై త్వరగా స్పందించాలి

- ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలని, అర్జీలను వేగంగా పరిష్కరించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పోలీసు అధికారులకు సూచించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 98 మంది బాధితులు ఫిర్యాదులు సమర్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్ రామారావు, డీటీసీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

- జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను నిర్ధిష్ట గడువులోగా పరిష్కరించాలని, వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలని యంత్రాంగానికి సూచించారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు 411 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 141. మిగిలినవి వివిధ శాఖలకు చెందినవి ఉన్నాయి.



జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు సమస్యను తెలుపుతున్న బిషప్ ప్రశాంతం తదితరులు

- పీ-4 మార్గదర్శుల ఎంపికకు కృషి చేయాలి

పీ-4 మార్గదర్శుల ఎంపికకు అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. పీ-4పై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈనెల 19న రాష్ట్ర స్థాయిలో పీ-4 పథకాన్ని ఆవిష్కరిస్తున్నందున, మార్గదర్శుల ఎంపికను అధికారులు సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

- నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో మృతి చెందిన విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ ఉల్లిపాయల మురళీకృష్ణ యాదవ్ జేసీకి వినతిపత్రం ఇచ్చారు. ఆ విద్యార్థిని మృతి పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. నగరంలో ఇప్పటికే నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, కార్పొరేట్ కళాశాలలు అనుమానాస్పద మరణాలకు కేంద్రాలుగా మారాయని ఆరోపించారు.

- అంధులను సూపర్ సిక్స్ పథకాలకు అర్హులను చేసి, అన్నీ ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని ఏపీ అంధుల సమాఖ్య కోరింది. ఈ మేరకు ఆ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు షేక్ జకావుల్లా వినతిపత్రం ఇచ్చారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ శాశ్వత కార్యాలయాన్ని నగర పరిధిలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సమాఖ్య జిల్లా సలహాదారు ఎస్‌కే మస్తాన్, ప్రధాన కార్యదర్శి డీ కేశవులు, వికలాంగుల ఐక్యసంఘం అధ్యక్షుడు షేక్ సనావుల్లా, ఎస్‌కే జిలానీ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల నిరసన

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, పాస్టర్లు, సిస్టర్లపై దాడులు, అక్రమ కేసులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నెల్లూరు క్రైస్తవ సమైక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిషప్ ఎండీ ప్రశాంతం మాట్లాడుతూ 1950 ఆగస్టు 10న జారీ అయిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్, హిందూ మతం తప్ప ఇతర మతస్థులను షెడ్యూల్ కాస్ట్‌గా పరిగణించరాదని పేర్కొనడం రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమన్నారు. అనేక పోరాటాల తర్వాత 1956లో సిక్కులకు, 1990లో బౌద్ధులకు ఎస్సీ హోదా కల్పించి, దళిత క్రైస్తవులకు, దళిత ముస్లింలకు ఇంతవరకు కల్పించలేదని ఆరోపించారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో జేసీకి అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ కలివెల ఎలీషా కుమార్, మేజర్ డేనియల్, పాస్టర్లు, టెన్నర్ బాబు, డేవిడ్ దయాసాగర్, క్రాంతికుమార్, రాజశేఖర్, హృదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఏసీ మెకానిక్ మృతి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఏసీ కంప్రెషర్ బిగించే క్రమంలో ప్రమాదవశాత్తు టెర్రస్‌పై పడి గాయాలపాలై చికిత్స పొందుతూ ఏసీ మెకానిక్ మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని పొదలకూరురోడ్డు ఇందిరానగర్‌లో ఏసీ మెకానిక్ లతీఫ్(34) నివసిస్తు న్నాడు. ఈ నెల 8వ తేదీన తన అన్న సలీమ్‌తో కలిసి హరనాథపురంలోని ఓ ఇంట్లో ఏసీ బిగించేందుకు వెళ్లాడు. లతీఫ్ మూడో అంతస్థులో కంప్రెషర్ బిగించే క్రమంలో కాలు జారి పక్క మిద్దె టెర్రస్‌పై పడ్డాడు. తలకు, ఛాతీకి గాయాలయ్యాయి. అతడిని స్థానికులు నారాయణ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. బంధువు పర్వేజ్ ఫిర్యాదుతో బాలాజీనగర్ స్టేషన్ ఎస్ఐ పుల్లారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం) ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ప్రశాంతి నగర్‌లో శ్రీనివాసులు(55) కుటుంబం నివసిస్తోంది. ఆయన కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు, అక్కడి నుంచి నారాయణ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యులు సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం అక్రమ తరలింపు కేసులో కాకాణికి బెయిల్

నెల్లూరు (లీగల్), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌కి బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు మొదటి తరగతి స్పెషల్ ఎక్సైజ్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి షేక్ నిషాద్ నాజ్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఇందుకూరుపేట పోలీసులు కాకాణిని ఈ కేసులో ఒక నిందితునిగా చేర్చి ఉన్న విషయం పాఠకులకు విదితమే. దీనికి సంబంధించి వాద ప్రతివాదనలు విన్నాక న్యాయాధికారి కాకాణికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. రూ.25 వేల చొప్పున ఇద్దరు పూచీకత్తు ఇవ్వాలని కూడా ఉత్తర్వులలో పేర్కొన్నారు..

'హర్‌ఘర్ తిరంగా'లో భాగస్వాములు కండి

- హర్ ఘర్ స్వచ్ఛతా ర్యాలీలో జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో జిల్లా ప్రజలంతా దేశభక్తి ఉప్పొంగేలా హర్ ఘర్ తిరంగా-హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్ర మాల్లో భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన హర్‌ఘర్ తిరం గా-హర్ ఘర్ స్వచ్ఛత ర్యాలీని ఆయన ప్రారం భించారు. వీఆర్సీ నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేశ రక్షణ ఎంత ముఖ్యమో పరిశుభ్రత కూడా అంత ముఖ్యమని చెప్పారు. మన జాతీయ జెండాను గౌరవించుకుంటూ, మన దేశాన్ని శుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛమైన భార తదేశాన్ని నిర్మించటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినో త్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15వరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తు న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలం దరూ తమ ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేసి, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛ భారత దేశం కోసం తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై అవగాహన కల్పించాలి

నెల్లూరు (వైద్యం) : జిల్లాలో హెచ్ఐవీ, సుఖవ్యాధులు, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం చేయాలని వైద్య ఆరోగ్య శాఖను జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో వైద్యాధికారులతో కలిసి ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయా వ్యాధులు, సమస్యలపై రెండు నెలలు గ్రామ స్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో హుస్సేన్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఐవీఆర్ఎస్ కాల్స్‌లో సోమలరేగడకు ప్రథమస్థానం

- రాష్ట్రంలో నాలుగో స్థానం

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేసే ఐవీఆర్ఎస్ కాల్స్‌లో దుత్తలూరు మండలం సోమలరేగడ పంచాయతీ రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానాన్ని, జిల్లాస్థాయిలో ప్రథమస్థానాన్ని సాధించింది. సోమలరేగడ పంచాయతీలోని ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఐవీఆర్ఎస్ కాల్స్‌లో పారిశుధ్య కార్మికులు మీ ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నారా... అనే ప్రశ్నకు 90, వారానికి కనీసం రెండుసార్లయినా మీ ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా ... అనే ప్రశ్నకు 100 శాతం సమాధానం ఇచ్చారు. దీంతో సరాసరి 95 శాతం మంది ప్రజలు ఐవీఆర్ఎస్ కాల్స్‌కు సమాధానం ఇవ్వడంతో ఆ పంచాయతీ రాష్ట్రస్థాయిలో నాల్గవ, జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించింది. దీంతో పంచాయతీ కార్యదర్శి మేడిబోయిన నాగరాజుకు సోమవారం డీపీవో ఎల్.శ్రీధర్‌రెడ్డి ఫోన్ చేసి ప్రశంసించారు. త్వరలో జరగనున్న స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున, మండలంలోని పంచాయతీ కార్యదర్శులను ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



సోమలరేగడలో ఇల్లిల్లు తిరిగి చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

ఉదయగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో కొద్ది రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సోమవారం తెల్లవారుజాము విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనంతరం 9.30 నుంచి 12.30 గంటల మధ్యలో విద్యుత్ ఆగింది. కార్యాలయాల్లో అంధకారం నెలకొనడంతో అధికారులు, సిబ్బంది సైతం ఇబ్బందులు పడ్డారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌లతోనే తరచూ సమస్యలు ఉత్పన్నమై విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సిబ్బందే అంటున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9619
వెండి కిలో ధర	రూ. 117000
వెండి ఒక గ్రాము	రూ. 120.00

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

● వైసీపీ హయాం నుంచి బియ్యం అక్రమ రవాణా ● అధికారుల మౌనంపై విమర్శలు ● కోవూరులో పట్టుబడ్డ సరుకు సూత్రధారులెవరు ?

అనంతసాగరం, ఆగస్టు 11 ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలోనే జిల్లాలో రేషన్ మాఫియాకు బీజం పడింది. కొందరు రేషన్ సరుకులను అక్రమంగా తరలిస్తూ పేదల కడుపుకొడుతున్నారు. ఈ వ్యవహారంలో నాయకులు, డీలర్లు కీలకపాత్ర వహిస్తున్నట్లు సమాచారం. అనంతసాగరం మండలంలో 37 చౌకదుకాణాలు ఉన్నాయి. గతంలో వాహనాల ద్వారా సరుకులు అందించేవారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక డీలర్ల ద్వారా అందిస్తున్నారు. అయితే మాఫియా సభ్యులు చౌకదుకాణాలకు వచ్చిన సరుకులు బయట మార్కెట్లకు తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. ప్రభుత్వం మారినా దోపిడీ మాత్రం ఆగలేదు.

● గ్రామాల్లో ఏజెంట్లు

రేషన్ బియ్యం సేకరణ కోసం గ్రామాల్లో వ్యాపారులు ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని, ప్రతి నెల 1 నుంచి 20 లోపు బియ్యాన్ని లబ్ధిదారులు, డీలర్ల నుంచి సేకరిస్తారు. వారికి కిలోకు రూ.15 చెల్లిస్తారు. అనంతరం ఆ బియ్యాని రహస్య గోదాములకు తరలించి మరుసటి నెల 1 నుంచి 10 లోపు అదునుచూసి బుచ్చి, నెల్లూరులోని రైసు మిల్లులకు రవాణా చేస్తారు. ఏజెంట్లకు కిలోకు రూ.5 చెల్లిస్తారు. ఇక మిల్లులకు తరలించిన బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి బహిరంగ మార్కెట్‌లలో కిలో రూ .40కి అమ్ముతారు. ఇలా బియ్యం అక్రమదందా సాగుతోంది. అధికారులు మాత్రం తేలిగ్గా లెక్కేసుకొంటున్నారు.

● కోవూరులో పట్టుబడిన సాగరం బియ్యం

ఇటీవల కోవూరు వద్ద మినీట్రక్కులో సుమారు 100 బస్తాల రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఇవి అనంతసాగరం నుంచి తరలిస్తున్నట్లు పోలీసులు, పౌరసరఫరాల అధికారులు గుర్తించారు. బస్తాలకు సీలు కూడా తీయని బియ్యం పెద్దమొత్తంలో గమనార్హం. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

● వెంగంపల్లి వాసులేనా?

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడేది వెంగంపల్లి వాసులేనని తెలుస్తోంది. గత వైసీపీ నుంచి వారికి నాయకులు, అధికారులు అండదండలతో ఈవ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. కోవూరు వద్ద పడ్డుబడ్డ బియ్యంలో వీరి హస్తం ఉన్నట్లు సమాచారం. విచారణలో ఇకనైన అసలు సూత్రధారులు బయటికి వస్తారా? వారిపై చర్యలు ఉంటాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.


కోవూరు వద్ద పట్టుబడ్డ రేషన్ బియ్యం (ఫైల్)

తనిఖీలు చేస్తున్నాం

బియ్యం పట్టుబడిన విషయం పత్రికల్లో రావడంతో మండలంలోని అన్ని రేషన్‌షాపులను విస్తృతంగా తనిఖీ చేస్తున్నాం. వెంగంపల్లిలో రెండు షాపులు ఉంటే పరిశీలించాం. రికార్డుల పరంగా సరుకులు ఉన్నాయి.
-అజమతుల్లాఖాన్, పౌరసరఫరాలశాఖ డీటీ

చౌక దుకాణాల ఆకస్మిక తనిఖీ

అనంతసాగరం మండలంలోని ఇనగలూరు, వెంగంపల్లి, ఆమనిచిరివేళ్ల, అనంతసాగరంలోని రేషన్‌దుకాణాలను ఆత్మకూరు పౌరసరఫరాలశాఖ డీటీ అజమతుల్లాఖాన్ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సరుకులు సరిగ్గా ఉన్నాయా? లేవా? అని చూశారు. అవకతకలు జరగకుండా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌పి రామయ్య ఉన్నారు.

రూ.17.16 కోట్లతో సిమెంట్‌రోడ్ల నిర్మాణం


మాట్లాడుతున్న పీఆర్ డీఈ మణికుమార్

ఉదయగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని ఎనిమిది మండలాల్లో పల్లెపండుగలో భాగంగా రెండోవిడత సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి రూ.17.16 కోట్లు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. సీతారామపురం మండలంలో 19 పనులకు రూ.1.47 కోట్లు, ఉదయగిరిలో 23 పనులకు రూ.2,12 కోట్లు, వింజమూరులో 25 పనులకు రూ.1.80 కోట్లు, వరికుంటపాడులో 26 పనులకు రూ.3.63 కోట్లు, దుత్తలూరులో 24 పనులకు రూ.2.01 కోట్లు, జలదంకిలో 21 పనులకు రూ.2 కోట్లు, కలిగిరిలో 16 పనులకు రూ.2.12 కోట్లు, కొండాపురం మండలంలో 31 పనులకు రూ.2.01 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆయా మండలాల్లో మరుగుదొడ్లు, బస్‌షెల్టర్ల నిర్మాణానికి రూ.1.05 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ గోడపత్రికల ఆవిష్కరణ


సీతారామపురం : గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న మండల అధికారులు

సీతారామపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను అధికారులు ఆవిష్కరించారు.మండలంలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 3504 మంది పిల్లలకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తామన్నారు. డీ వార్మింగ్ ప్రోగ్రాం నూరు శాతం విజయవంతం చేసేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవి.కృష్ణారెడ్డి,ఎంపీడీవో సాయి ప్రసాద్, వైద్యాధికారిణి స్వప్నరెడ్డి, ఎంఈవో మస్తాన్‌వలి,ఈవోపీఆర్డీ రాంనాథ్‌రెడ్డి, వైద్యఆరోగ్యసిబ్బంది, పాల్గొన్నారు.

● వింజమూరు : మండలంలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, సీతారామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఎంపీడీవో ఆఫీసులో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో ఎన్నో ప్రయోజనాలు

సీతారామపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పచ్చిరొట్ట ఎరువులను వినియోగిస్తే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చునని జిల్లా వనరుల కేంద్రం టెక్నికల్ ఏవో రామ్మోహన్ తెలిపారు. మండల పరిధిలోని బసినేనిపల్లి రైతు సేవాకేంద్రంలో సోమవారం రైతులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనలతోనే రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, ఏఈవో సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉదయగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో తగిన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి తెలిపారు. సోమవారం మండలంలోని శకునాలపల్లి రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మోతాదుకు మించిన ఎరువులు వాడరాదన్నారు. పంటల సాగులో రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో విజయభాస్కర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరులో: మండలంలోని తెడ్డుపాడు రైతుసేవా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ దేవసేన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన రకాలు, విత్తన శుద్ధి, నారుమడి యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో మదన్‌మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్యకు చంద్రన్న సేవారత్న పురస్కారం


అవార్డును అందుకుంటున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు

ఆత్మకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు టౌన్‌హాల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో చంద్రన్న సేవారత్న పురస్కారాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావుకు ఫిలిం ప్రొడ్యూసర్, డైరెక్టర్ పసులేటి వెంకటరమణ అందజేశారు. ఈ సందర్భంగా పెంచలరావు మాట్లాడుతూ జిల్లాలో టీడీపీ ఎనలేని సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి 30 మందికి పైబడి చంద్రన్న సేవా రత్న పురస్కారాన్ని అందజేయడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సోమశిల ఉత్తర కాలువ వైస్ చైర్మన్ పూనుగుంట ధనుంజయ, మహిమలూరు నీటి సంఘం వైస్‌చైర్మన్ తోటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చేతిపంపు

అనంతసాగరం : సాగరంలోని బస్టాండ్ బద్వేల్ రోడ్డు మలుపు వద్ద ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన చేతిపంపు తుప్పుపట్టి అధ్వానస్థితికి చేరుకొంది. పంపు కింది భాగం పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు చొరవ చూపి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతు న్నారు.




హెచ్‌ఎం బుజ్జయ్యకు సన్మానం


హెచ్‌ఎం బుజ్జయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సంగం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బుజ్జయ్య జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘం కమిటీ ట్రెజరర్‌గా ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆదివారం నెల్లూరులో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నికలు జరగ్గా బుజ్జయ్యను ట్రెజరర్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

కోనోకార్పస్ మొక్కలు తొలగించాలని వినతి


వినతిపత్రం అందచేస్తున్న జనసేన నాయకులు

సంగం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీ జనసంఘం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలని జనసేన నాయకులు సోమవారం ఎంఈవో మల్లయ్యకు వినతిపత్రం అందచేశారు. ఆరోగ్యానికి హానికలిగించే ఈ చెట్లను తొలగించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో జనసేన నాయకులు దాడి భానుకిరణ్ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. వెంటనే తొలిగించాలని వినతిపత్రం అందచేశారు. లేకపోతే తామే తొలిగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు పాలసీ జీవితానికి భరోసా


రామకృష్ణ

వింజమూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు పాలసీ జీవితానికి భరోసా ఇస్తుందని మేనేజర్ రామకృష్ణ అన్నారు. స్థానిక ఎస్‌బీఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరిచే బీమా పథకాలు, లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీల గురించి వివరించారు. నిరుపేద కుటుంబాలు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నెలకు రూ.20 నుంచి రూ.10వేల వరకు ప్రీమియం చెల్లిస్తే, ప్రమాదవశాత్తు మరణించినప్పుడు ఈ బీమా మొత్తం ఖాతాదారులకు వడ్డీతో సహా బ్యాంక్ అందిస్తుందని ఆయన తెలిపారు. చైల్డ్ పాలసీలు డిపాజిట్ చేస్తే వారు చదువురీత్యా, ఉద్యోగరీత్యా ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

వృద్ధురాలికి నిత్యావసరాల అందజేత


పోలమ్మకు నిత్యావసర సరుకులు అందిస్తున్న జర్నలిస్టు పకీరయ్య

వింజమూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో పోలమ్మ అనే వృద్ధురాలికి కొంతకాలంగా పెన్షన్ రావడంలేదు. ఈ విషయాన్ని గమనించిన జర్నలిస్టు గడ్డం పకీరయ్య ఆమెకు రూ.5వేలు నగదు, బస్తా బియ్యం, నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. ఆయన దాతృత్వాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రాము, మాధవ, నరసింహ, సురేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు

ఎంఈవో-2గా ప్రవీణ్ బాధ్యతల స్వీకరణ


ప్రవీణకు నియామక పత్రాన్ని అందచేస్తున్న విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలి

సీతారామపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎంఈవో.2 గా స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీ.ప్రవీణ సోమవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడా ఎలాంటి డ్రాప్ అవుట్లు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులను సిబ్బందిని కలుపుకుని విద్యాభివృద్ధికి పాటుపడతామని తెలిపారు.అనంతరం ఎంఈవో షేక్ మస్తాన్‌వలి ఆమెను సన్మానించారు.

నేడు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఉదయగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 1 నుంచి 19 ఏళ్ల వయసు గల 6,642 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం ఈ మాత్రలను మింగనుంచనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా పాఠశాలలు, కళాశాలలకు తమ సిబ్బందితో మాత్రల పంపిణీ పూర్తి చేశామన్నారు.

ఎఫ్‌ఏ-1 పరీక్షల పరిశీలన

ఉదయగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నిర్మాణాత్మక ముదింపు ఎఫ్‌ఏ-1 పరీక్షను సోమవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పరిశీలించారు. అన్ని తరగతుల విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా అసెస్మెంట్ బుక్‌లెట్స్ వచ్చాయో.. లేదో ప్రధానోపాధ్యాయులు సరి చూసుకోవాలన్నారు. పరీక్ష సమయంలో విద్యార్థి బుక్‌లెట్స్‌లోని పెన్ ఐడీ, అపార్ ఐడీ సక్రమంగా నమోదు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏ పాఠశాలకైనా బుక్‌లెట్స్ తక్కువగా వచ్చినట్లయితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కొండయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలను విజయవంతం చేయండి

ఉదయగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, సంస్థపరంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ ధర్నాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ధర్నాల్లో ఎస్ఎంయూపీ ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఆర్టీసీలో ఆన్ కాల్ డ్రైవర్ల నియామకం

ఆత్మకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : స్థానిక డిపో పరిధిలో ఆన్ కాల్ పద్ధతిన ఆర్టీసీ బస్సుల్లో డ్రైవర్ల నియామకం చేపట్టనున్నామని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని డీఎం ఎం శివకేష్‌యాదవ్ తెలిపారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండి 18 నెలల పాటు వాహనం నడపడంలో అనుభవం కలిగి, 39 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. తమ పేర్లను డిపోలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

టిప్పర్ల ఢీ : తప్పిన ప్రమాదం


ఆగి ఉన్న టిప్పరును ఢీకొన్న మరో టిప్పరు

వింజమూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ అదుపుతప్పి ఆగి ఉన్న మరో టిప్పర్‌ను ఢీకొంది. దీంతో మెకానిక్ షాప్‌లోకి టిప్పర్ దూసుకెళ్లింది. రెండు టిప్పర్‌లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాద సమయంలో షాపులో ఎవరూ. లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

C.R.I.M.E N.E.W.S

కారు బోల్తా : ఒకరి దుర్మరణం

● ముగ్గురికి తీవ్రగాయాలు


కారు సీటులోనే మృతి చెందిన పినపాటి రత్నరాజు

దగదర్తి(బిట్రగుంట), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సున్నంబట్టి సమీపంలో కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై సోమవారం ఉదయం కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరుకు చెందిన పినపాటి రత్నరాజు(83), అతని భార్య విజయకుమారి, కోడలు సుహాసిని, అల్లుడు వంశీలు తెనాలిలో బంధువు మృతి చెందగా అక్కడికి వెళ్లేందుకు ఆదివారం రాత్రి బెంగళూరు నుంచి కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో సున్నంబట్టికి 2 కిలోమీటర్ల దూరంలో వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముందు సీట్లో కూర్చుని ఉన్న రత్నరాజు సీట్లోనే మృతి చెందాడు. అతని భార్య విజయకుమారి, కోడలు సుహాసిని, కారు నడుపుతున్న అల్లుడు వంశీకి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ జంపాని కుమార్ సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రత్నరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

మురుగు కాలువలో పడి
గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి):స్థానిక సబ్బారెడ్డినగర్‌లో సోమవారం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడని ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మినీ లారీ కింద పడి ఆవు...


మినీ లారీ కింద పడి మృతిచెందిన ఆవు

ఉదయగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గండిపాళెం మార్గంలో పెట్రోల్‌బంకు సమీపాన సోమవారం మినీలారీ కింద పడి ఆవు మృతిచెందింది. సేకరించిన వివరాల మేరకు, గండిపాళెం వైపు నుంచి ఉదయగిరిలోకి మినీ లారీ వస్తున్నది. ఆ సమయంలో పెట్రోల్‌బంకు సమీపాన రెండు ఆవులు పోట్లాడుకుంటూ మినీ లారీ కింద పడ్డాయి. ఈ ప్రమాదంలో ఒక ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. మరో ఆవు లారీ కింద ఇరుక్కుపోయింది. గమనించిన స్థానికులు ఆ ఆవును బయటకు తీశారు. కాగా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

● రూ. 7లక్షల ఆస్తి నష్టం ● నాయుడుపల్లిలో ఘటన


నాయుడుపల్లి(మడ)లో దగ్ధమైన ఇంటి పైకప్పు

మనుబోలు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లి పంచాయతీలోని నాయుడుపల్లి (మడ)లో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు అగ్నికి ఆహుతైంది. బాధితుల వివరాల మేరకు... రావూరి వెంకటసుబ్బయ్య నాయుడు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం వ్యవసాయ పనులకోసం రూ. 2 లక్షల నగదు తెచ్చి బీరువాలో ఉంచాడు. పనుల నిమిత్తం సుబ్బయ్యనాయుడు, ఆయన భార్య కురిచెర్లపాడుకు వెళ్లారు. స్తంభం నుంచి సర్వీస్ వైరుకు షార్ట్ సర్క్యూట్ అయింది. పెద్దఎత్తున మంటలు వ్యాపించడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దుస్తులు, నాలుగు సవర్ల బంగారం, రూ. 2 లక్షల నగదు, వస్తు, వంటసామాగ్రి, 14 బస్తాల ధాన్యం కాలి బూడిదయ్యాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. రూ. 7లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధిత రైతు వెంకటసుబ్బయ్య వాపోయాడు.

లైంగికదాడిపై డీఎస్పీ విచారణ

సంగం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంగం పోలీస్ స్టేషన్‌లో నమోదైన లైంగిక దాడి కేసును డీఎస్పీ వేణుగోపాల్ సోమవారం విచారించారు. సంగం - కలిగిరి రహదారిలోని మామిడి తోటలో ఈనెల 3న రాత్రి తోట యజమాని యేసోబు, కొంతమంది యువకులతో మందు పార్టీ చేసుకున్నారు. ఈ క్రమంలో మద్యం మత్తులో యేసోబు తోటలో కాపలాగా ఉన్న మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆ మహిళ మరుసటి రోజు తన భర్తతో కలిసి నెల్లూరు ఎస్పీకి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో విచారించిన సంగం పోలీసులు యేసోబుపై లైంగిక దాడి కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణ నిమిత్తం డీఎస్పీ తోట వద్దకు వెళ్లి బాధితురాలిని సాక్షులను విచారించారు. ఈ విచారణలో ఆయనతోపాటు ఎస్‌ఐ రాజేష్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● బంగారం, వెండి వస్తువుల అపహరణ

కావలిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ఇస్లాంపేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిందని బాధితురాలు ఎస్‌కే.రసూల సోమవారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. ఇస్లాంపేటలో ఉంటున్న రసూలా ఇంటికి తాళం వేసి రెండు రోజుల క్రితం ఒంగోలుకు వెళ్లింది. ఆదివారం రాత్రి తిరిగి ఇంటికి రాగా తలుపు తాళం పగల గొట్టి ఉండటంతో ఇంట్లో పరిశీలించగా బీరువాలోని రూ.65,000 విలువ గల బంగారు, వెండి వస్తువులు అపహరించుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ జమాల్‌వలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	212
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 510



చెత్త రిక్షాల పంపిణీ

వలేటివారిపాలెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం గ్రామ పంచాయతీలో ఇంటింటికి చెత్త సేకరణలో భాగంగా పంచాయతీ నిధులతో నూతనంగా రెండు చెత్త రిక్షాలను కొనుగోలు చేసి సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. వాటిని క్లాప్‌మిత్రలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, సర్పంచు సాదు శ్రీలత, పంచాయతీ కార్యదర్శి మురళి, నాయకులు వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అందని 'ఉపాధి' కూలి!

● ఆరు వారాలుగా శ్రామికుల అవస్థ ● భారంగా మారిన కుటుంబ పోషణ ● బిల్లులు చెల్లించాలని వేడుకోలు

వలేటివారిపాలెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకుంటున్నారు. కానీ ఆరు వారాలుగా చేసిన పనులకు కూలి డబ్బులు ఇవ్వడంలో జాప్యం జరగడంతో శ్రామికులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ పోషణ భారమై అప్పులు చేస్తూ అవస్థలు పడుతున్నారు. కూలి డబ్బులు చెల్లించి మా ఆకలి తీర్చండయ్యా.. అంటూ వేడుకుంటున్నారు. మండలంలో ఉపాధి హామీ పనులకు వెళ్లే శ్రామికుల దుస్థితి ఇదీ. మండలంలోని 21 పంచాయతీల్లో 11,375 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రతి రోజూ సుమారు 5 నుంచి 6 వేల మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. వీరికి ఆరు వారాలకు సంబంధించిన కూలి నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. వ్యవసాయ పనులకు వెళ్లాలనుకుంటే వర్షాలు లేక వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదు. చేసిన పనులకు ఉపాధి కూలీ రాకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.


అయ్యవారిపల్లెలో ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు (ఫైల్)

దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కొందరికి 100 రోజుల పని దినాలు పూర్తికావడం, మరికొందరికి వర్షాలు పడడంతో పనులు నిలిపివేశారు. దీంతో అటు పనులు లేక, ఇటు చేసిన పనులకు నగదు చెల్లించకపోవడంతో శ్రామికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కూలీలకు రావల్సిన నగదు చెల్లించాలని శ్రామికులు కోరుతున్నారు.

ఆరు వారాల డబ్బులు జమ కాలేదు

ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సకాలంలో బిల్లులు రావడం లేదు. పనులు చేసి ఆరు వారాల డబ్బులు తమ ఖాతాలోకి జమ కాలేదు. కుటుంబపోషణ కోసం ఇబ్బందులు పడుతున్నాం. అప్పు తెచ్చి ఇంటి ఖర్చులకు వినియోగించుకొంటున్నాం. ఇప్పటికైనా బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

- కొండపనాయుడు, వలేటివారిపాలెం

బిల్లులు ఆన్‌లైన్ చేశాం

ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన శ్రామికులకు ఆరు వారాలకు సంబంధించి న బిల్లులు ఆన్‌లైన్ చేశాం. త్వరలోనే నిధులు విడుదలవుతాయి. నిధులు విడుదలైన వెంటనే శ్రామికుల బ్యాంకు ఖాతాలోకి జమ అవుతాయి. శ్రామికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- దయాసాగర్, ఏపీవో, వలేటివారిపాలెం

ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిబంధనలు పాటించాలి

● కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత

కావలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత హెచ్చరించారు. సోమవారం ఆమె గైనకాలజిస్ట్ డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ మేఘనాథ్, డిప్యూటీ సహాయ అధికారి ఎస్ శివకుమార్‌తో కలిసి పట్టణంలోని ప్రవీణ్, లత తల్లీపిల్లల, రవికాంత్, లక్ష్మీనారాయణ ఆసుపత్రులతో పాటు ఎస్‌వీ ల్యాబ్‌లను తనిఖీ చేశారు. ఆయా ఆసుపత్రుల రికార్డులు, రోగులకు అందిస్తున్న సేవలు, ఇన్, అవుట్ పేషెంట్ల వివరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2002 కింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పొల్యూషన్, ఫైర్‌సేఫ్టీమెజర్మెంట్, బయోమెడికల్ వేస్టేజ్, ఆసుపత్రి అందిస్తున్న సేవలు, డాక్టర్ల వివరాలు, వారు వసూలు చేసే ధరల వివరాలను తెలిపే బోర్డులను ప్రదర్శించాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతి మూడు నెలలకొకసారి ప్రతి ఆసుపత్రిని సందర్శించి లోటుపాట్లు ఉంటే కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ బ్రిజిత

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కందుకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 17, 18, 19 తేదీలలో నెల్లూరులో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం నత్తా రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సురేష్‌బాబు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 25వరకు రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయని, ఈ మహాసభలకు కందుకూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ సానుభూతిపరులు, యువతీ యువకులు తరలివెళ్లేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఆనంద్‌మోహన్, కే.మురళి, సీహెచ్ దుర్గాప్రసాద్, బొజ్జా చంద్రమోహన్, నరసయ్య, ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాలబ్రహ్మాచారి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు 'డ్రోన్' బహూకరణ


డీఎస్పీకి డ్రోన్ కెమెరా అందజేస్తున్న కంచర్ల వెంకటేశ్వర్లు

కందుకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ డివిజన్ పోలీసులకు రూ.1.5 లక్షలు విలువైన డ్రోన్ కెమెరాను యోధ డయాగ్నోస్టిక్స్ అధినేత కంచర్ల సుధాకర్ బహూకరించారు. దీనిని ఆయన తండ్రి కంచర్ల వెంకటేశ్వర్లు సోమవారం సబ్ డివిజన్‌లో డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యంకు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడ ఎలాంటి అసాంఘిక, సంఘ విద్రోహ కార్యక్రమాలు జరుగుతున్నా ఆ సమాచా రం సేకరణకు డ్రోన్ కెమెరా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమవం తుగా తోడ్పాటునందించిన కంచర్ల సుధాకర్‌ను అభినందించారు. ఆయన తండ్రి వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించారు. కార్యక్ర మంలో కందుకూరు, గుడ్లూరు సీఐలు అన్వర్‌బాషా, మంగారావు, పట్టణ ఎస్ఐ శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ధర్నా


సబ్‌స్టేషన్ ఎదురుగా ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జలదంకి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం జలదంకి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి, అదానీసంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేపట్టిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత అదేవిధానాన్ని కొనసాగిస్తూ అదానీ సంస్థ అడుగులకు మడుగులు ఒత్తుతోందని విమర్శించారు. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్‌స్టేషన్ సిబ్బందికి వినతిపత్రంను అందజేశారు. ఈ ధర్నాలో నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, గడ్డం మాల్యాద్రి, గడ్డం విజయలక్ష్మి, మేలంగి ఆంథోనీబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నత'మని ఊబిలోకి!

(5వ పేజీ తరువాయి)

తెలుస్తుంది. కానీ కొందరు వ్యభిచార గృహాల నిర్వాహకుల వద్ద భారీ మొత్తంలోనే నగదు తీసుకుంటూ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకురావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినా, కొందరు రాజకీయ నేతలు, విలేకర్ల ఒత్తిళ్లకు తలొగ్గి వారు సైతం మిన్నకుండిపోతున్నారు. స్థానికులు సమాచారం ఇచ్చినప్పుడు మాత్రం విధిలేని పరిస్థితుల్లో దాడులు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ దందాను అరికట్టాల్సిన అవసరం ఉంది.

'టీఆర్‌ఆర్' అధ్యాపకుల నిరసన


కళాశాల ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల అధ్యాపకులు

కందుకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. అధ్యాపక సంఘాలు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి కళాశాల ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అధ్యాపకుల బదిలీల ప్రక్రియను తక్షణం చేపట్టాలని, దేశంలోని 26 రాష్ట్రాలలో అమలులో ఉన్నవిధంగా తమను అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్లుగా రీడిజిగ్నేట్ చేయాలని, గత ప్రభుత్వంలో ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులను ప్రభుత్వ కళాశాలల్లో నియమిస్తూ జారీచేసిన జీఓనెం. 42ను తక్షణం రద్దుచేయాలన్న ప్రధాన డిమాండ్లతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణం తగు ఉత్తర్వులు జారీ చేయకుంటే ఈనెల 18న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పీ.రాజగోపాల్, ఎస్.తిరుపతిస్వామి, కమలబాబు, ఎస్వీ శ్రీహరి, ఏడుకొండలునరేంద్ర, కే.సుజాత, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ


తిమ్మారెడ్డిపాలెంలో నూతనంగా ప్రతిష్ఠించిన గంగమ్మ విగ్రహం


ఆలయం వద్దకు పాలు, పెరుగు, నెయ్యి తీసుకువస్తున్న మహిళలు

లింగసముద్రం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో గ్రామ దేవత గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభంగా జరిగింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నూతన గంగమ్మ విగ్రహంతో పాటు పోతురాజు, వినాయకస్వామి, వీరభద్రస్వామి విగ్రహాలను గ్రామంలో ఊరేగించిన అనంతరం విగ్రహాలను ధాన్యంలో ఉంచారు. రెండవ రోజు ఈ విగ్రహాలను ఊరేగింపుతో ఆలయం వద్దకు తీసుకొని వచ్చి మహిళా భక్తులు బిందెలతో పసుపు నీళ్లు తీసుకొని వచ్చి పూజలు చేశారు. మూడవ రోజు సోమవారం గ్రామస్తులు మేళతాళాలు, భాజాభజంత్రీల మధ్య విగ్రహాలను పాలు, పెరుగు, నెయ్యితో అభిషేకం చేశారు. అనంతరం నవకోటి ధాన్యాలతో గంగమ్మ దేవత విగ్రహాన్ని ఆలయం లోపల, పోతురాజు, వినాయస్వామి, వీరభద్రస్వామి విగ్రహాలను ఆలయం వెలుపల ప్రతిష్ఠింప చేశారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గర్భిణులు రక్తహీనతను అధిగమించాలి


గర్భిణులకు ఐరన్‌పోలిక్ సిరప్‌లు అందచేస్తున్న డాక్టర్ మహేష్

కావలి. ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించాలని వెంగళరావునగర్ అర్బన్‌హెల్త్‌సెంటర్ డాక్టర్ మహేష్ తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ పథకం కింద డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించడానికి తరచూ రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తం తక్కువగా ఉన్న వారు అవసరమైన పౌష్టికాహారం తీసుకోవటమే కాక అవసరమైతే రక్తం కూడా ఎక్కించుకోవాలన్నారు. అలాగే క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందు లు అందచేస్తారని చెప్పారు. తద్వారా మాతృ, శిశు మరణాలు నివారించుకోవచ్చన్నారు. అనంతరం డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ వారు ఐరన్‌పోలిక్, కాల్షియం, జింక్ విటమిన్స్ సిరప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కే.తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, సీవో ప్రసాద్ పాల్గొన్నారు.

162 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 299 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 162 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-121, సీఆర్-9, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 137 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.150, సగటు ధర రూ.221.76గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

న్యూస్ బాక్స్

పరిహారం పెంచాలి

● ఉప్పరపాలెం గ్రామస్థుల వినతి

ఉలవపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు పరిధిలో భాగంగా తరలించే గ్రామాల్లో ఒకటైన ఉప్పరపాలెం గ్రామం ఎస్సీ కాలనీవాసులు తమకు పరిహారం ప్యాకేజీని పెంచాలని కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కలెక్టర్ ఆనంద్ ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలో పర్యటించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిధిలో వచ్చే నష్టపరిహారాలను వివరించారు. ఒక్కో పీడీఎఫ్ కుటుంబానికి జీవన భృతి, ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు పరిహారం అందిస్తుందని తెలిపారు. దీనిపై ఎస్సీ కాలనీవాసులు కరేడు పరిసర ప్రాంతంలోనే ట్రాన్స్‌పోర్టుకు అనుకూలంగా ఉండే ప్రాంతమైతేనే వెళ్లేందుకు అంగీకరిస్తామని, పీడీఎఫ్ కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం పెంచేలా చూడాలని తమ అభిప్రాయాన్ని వినతిపత్రంలో పేరుకున్నారు. దీనిపై డిప్యూటీ కలెక్టర్ స్పందిస్తూ కాలనీవాసుల వినతులను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించండి

కలిగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరు గ్రామ సర్వే నెంబరు 739లో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు సోమవారం నిర్వహించిన గ్రామసభలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని గ్రామస్థులు కోరారు. తహసీల్దారు గిరీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో 606.05 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటుకు యోగ్యవంతమైన భూములను ఏపీఐఐసీకి అప్పగించేందుకు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మొక్కా సుజాత, స్థానిక టీడీపీ నాయకులు బీవీ రామారావు, హజరత్‌రావు పాల్గొన్నారు.

మాతమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ



గుడ్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు ఎస్సీ కానీలో వెలసి ఉన్న మాదిగ సామాజికవర్గం కులదేవత మాతమ్మ ఆలయ పునఃనిర్మా ణానికి సోమవారం భూమి పూజ చేశారు. పూర్వం నుంచి ఉన్న ఆలయం స్థానంలో నూతన ఆలయం నిర్మించేందుకు కాలనీవాసులు శ్రీకా రం చుట్టారు. గుడ్లూరుకు చెందిన జీఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత గుండెమడుగుల స్టీఫెన్ సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వాహ కులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణానికి మంచిరాజు మురళీమోహన్, అపర్ణ దంపతులు తమ చిన్నకుమారుడు, కోడలు షణ్ముఖశ్రీహర్ష, దురచిత్ర పేరుతో రూ.25001లు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లులకు ఈ మొత్తాన్ని అందజేశారు.

రేపు అన్నదాత సుఖీభవ ర్యాలీ

జలదంకి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఈనెల 13న నిర్వహించ తలపెట్టిన అన్నదాత-సుఖీభవ విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధుమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ర్యాలీ బుధవారం దుత్తలూరు సెంటర్ నుంచి ప్రారంభమై ఉదయగిరి ఏఎంసీ కార్యాలయం వద్దకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో అందరు కూటమి నాయకులు తప్పక పాల్గొనాలని కోరారు.

పీజీఆర్ఎస్‌కు 3 వినతులు

కొండాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 3 వినతులు అందినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. తూర్పుఎర్రబల్లిలో దారిని ఆక్రమించారంటూ ఒకటి, భూముల ఆధార్ లింకు కోసం 2 వినతులు అందాయన్నారు. వీటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

● **బిట్రగుంట(ఆంధ్రజ్యోతి):** బోగోలు తహసీల్దారు కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందులో బోగోలు, బిట్రగుంట పంచాయతీల్లో ఇంటి స్థలాలకు సంబంధించి సర్వే నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. తాళ్ళూరు, జక్కేపల్లిగూడూరు పంచాయతీలో రైతులు పేర్ల సవరణపై రెండు అందాయని తెలిపారు.

శిథిలమైన ఆర్టీసీ బస్ షెల్టర్ పరిశీలన


శిథిలమైన ఆర్టీసీ బస్‌షెల్టర్‌ను పరిశీలిస్తున్న బీద గిరిధర్, జనసేన, బీజేపీ నాయకులు

అల్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అల్లూరులో రెండు దశాబ్దాల కాలంగా శిథిలావస్థలో ఉన్న ఆర్టీసీ బస్టాండును సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, జనసేన, బీజేపీ నాయకులతో కలసి సోమవారం పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న బస్టాండును ఏ విధంగా చేస్తే ప్రజలకు వినియోగంలోకి వస్తుందోనే అంశంపై చర్చించారు. పునఃప్రారంభానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులురెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, నజీర్‌బాషా, కారుమంచి కార్తీక్ శర్మ, దేవళ్ల హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు భద్రత ప్రమాణాలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ అన్వర్‌బాషా

కందుకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు భద్రత ప్రమాణాలు పాటించటంతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సీఐ అన్వర్‌బాషా కోరారు. పట్టణంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో సోమవారం ఆయన సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహజంచి పలు సూచనలు చేశారు. ప్రతి బ్యాంకులో విధిగా హై రెజల్యూషన్ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు అవి ఎల్లవేళలా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే బ్యాంకులకు వచ్చే ఖాతాదారులు తమ వాహనాలను రోడ్డుపై పెట్టి వెళ్తున్నందున బ్యాంకులు ఉన్న అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందన్నారు. తమ బ్యాంకుల వద్ద వాహనాలను క్రమపద్ధతిలో పెట్టుకుని ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డుపై వాహనాలు నిలపకుండా పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసుకోవటం ద్వారా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ పులి శివనాగరాజు పాల్గొన్నారు.

ఎంఈవో మాల్యాద్రికి ఘన సన్మానం


ఎంఈవో-1 మాల్యాద్రిని సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు వెంగళరావు, తదితరులు

లింగసముద్రం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఎంఈవో-1గా నియమితులైన కనుపర్తి మాల్యా ద్రిని సోమవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో జిల్లా నారా లోకేష్ యువజన ఫౌండేషన్ అధ్యక్షుడు పల్లపోతు వెంగళరావు టీడీపీ నాయకులతో కలిసి శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో పలు వురు నాయకులు పాల్గొన్నారు.

రైల్వే కోర్టు న్యాయాధికారి బదిలీ

నెల్లూరు(లీగల్) : నెల్లూరు మొదటి తరగతి స్పెషల్ రైల్వే కోర్టు న్యాయాధికారిగా పని చేస్తున్న పాలమంగళం వినోద్‌ను కర్నూలు జిల్లా డోన్ ప్రిన్సిపల్ జూనియర్ న్యాయాధికారిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

చిరిగిన జెండాకి వందనమెలా?



తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీపంలో సుబ్బలక్ష్మి విగ్రహం కూడలిలోని భారీ జాతీయ జెండా చిరిగి పేలికలవుతోంది. ఎండకి ఎండీ, వానకు చివికి ఇలాగే రెపరెపలాడుతోంది. తక్షణం ఇక్కడ కొత్త జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయాల్సివుంది.

అనిల్.. అసాధ్యుడే

- వైసీపీ ప్రభుత్వంలో సెటిల్మెంట్లు
- పవన్‌పై దాడి ఘటనలో కీలక నిందితుడు
- వీడియో ఆధారాలతో కేసు నమోదు
- ఫైబర్ లాఠీ ఇచ్చింది ఏఎస్ఐ కుమారుడు!
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మా వైసీపీ సోషల్ విభాగం అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి అమాయకుడు. పవన్‌పై దాడి ఘటనలో అతడికి సంబంధం లేదు. ఇదీ ఆయన అరెస్టు సందర్భంగా తిరుపతి ఈస్ట్ పోలీసుతో వైసీపీ నేతల వాదన. కానీ, ఈ కేసులో పోలీసులు దర్యాప్తు చేస్తున్న కొద్దీ అనిల్‌కుమార్‌రెడ్డి అమాయకుడు కాదు.. అసాధ్యుడని తెలుస్తున్నట్లు సమాచారం. రెంటల్ బైకు తీసుకుని అద్దె చెల్లించలేదంటూ పులిచెర్ల మండలం మొరవపల్లికి చెందిన పవన్‌కుమార్‌ను గత బుధవారం మధ్యాహ్నం తిరుపతిలోని అనిల్ కార్యాలయానికి పట్టుకొచ్చారు. ఫైబర్ లాఠీ, దుడ్డుకర్రతో కొడుతూ.. కాళ్లతో తన్నుతూ అమానవీయంగా దాడి చేశారు. ఈ వీడియోలు వైరల్ కావడంతో భూమన అభినయ్ అనుచరుడు, నమ్మినబంటు అయిన అనిల్‌కుమార్‌రెడ్డి పేరు ప్రముఖంగా బయటకు వచ్చింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సెటిల్మెంట్లు, ఆర్థిక లావాదేవీలకు అనిల్ పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. భూదందాలు చేసినట్లు చెబుతున్నారు. ఓ నేతకు ఇతడు బినామీ అన్న ప్రచారమూ జరుగుతోంది. ఇతడి వద్ద ఓ బ్యాచ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతడి సెల్‌ఫోను కాంటాక్ట్స్, కాల్‌డేటా ఆధారంగా ఆ బ్యాచ్‌ను గుర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బ్యాచ్‌తో అనిల్ దౌర్జన్యాలు, దందాలు చేసేవాడని పోలీసుల విచారణలో బయటకు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ క్రమంలోనే ఇతడిని వైసీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ దౌర్జన్యాలు, దందాల నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం రాగానే తన నివాసాన్ని ఎస్టీవీ నగర్ నుంచి పద్మావతిపురంలోని భూమన ఇంటి సమీపానికి మార్చినట్లు చెబుతున్నారు. ఇటీవల ఎస్టీవీనగర్‌లో జరిగిన ఓ ఘటనకు సంబంధించి అనిల్ సోదరుడు, తండ్రిపైనా కేసు నమోదు కావడం గమనార్హం. కాగా, పవన్ కుమార్‌పైనా అనిల్‌కుమార్‌రెడ్డి దాడి చేసినట్లు.. విచక్షణారహితంగా దినేశ్ కొట్టే సమయంలోనూ పక్కనే ఉన్నట్లు వీడియోల ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ కేసులో నిందితులైన అనిల్‌కుమార్‌రెడ్డి, జగదీశ్వర రెడ్డి టీమ్‌లో ఫైనాన్సు లావాదేవాలు నడుపుతున్న దినేష్ ఉన్నాడు. ప్రస్తుతం ఈ ముగ్గురూ రిమాండులో ఉన్నారు. కాగా, దినేష్ జనసేన పార్టీ నేత అంటూ వైసీపీ ప్రచారం చేసింది. ఈ క్రమంలో తమ పార్టీకి, అతడికి సంబంధం లేదంటూ జనసేన ముఖ్య నేతలు పోలీసులకు స్పష్టం చేసినట్లు సమాచారం.

15కాదు.. 50 మంది

పవన్‌పై దాడి ఘటనకు సంబంధించి పోలీసుల విచారణలో నిందితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. తొలి రోజున నలుగురు, ఆ తర్వాత 15 మంది అని అంచనాకు రాగా.. ఇప్పుడా సంఖ్య 50కి చేరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వీరంతా అనంతపురం, చిత్తూరు, తిరుపతి, కడపకు చెందిన వైసీపీ బ్యాచ్‌గా భావిస్తున్నారు. చిత్తూరులో పవన్‌కుమార్‌ను బంధించి అతడి ద్వారా బలవంతంగా సెల్ఫీ వీడియోలు తీయించిన రవి అనే చోటా రౌడీ కూడా పోలీసుల అదుపులో వున్నట్లు తెలిసింది.



వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి కార్యాలయంలో పవన్‌కుమార్‌ను చితకబాదుతున్న అనిల్‌కుమార్ రెడ్డి

ఫైబర్ లాఠీ ఇచ్చింది ఏఎస్ఐ కొడుకు!

పోలీసులు వాడే ఫైబర్ లాఠీతో పవన్‌కుమార్‌ను దినేశ్ చితకబాదిన వీడియోలు బయటకు వచ్చాయి. దీంతో ఫైబర్ లాఠీ వీరికి ఎక్కడిదన్న ప్రచారం జరిగింది. ఈ దిశగా పోలీసులూ విచారించగా.. జిల్లాలో పనిచేసే ఓ ఏఎస్ఐ కుమారుడు ఇచ్చినట్లు బయట పడిందని తెలిసింది. వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఇతడు.. లాఠీ తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి విభిన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.



ఆడుదాం.. ఆంధ్ర

ఆడింది 47 రోజులు. ఖర్చుపెట్టింది రూ.ఐదారు కోట్లు. దుర్వినియోగమైనట్లు విజిలెన్సు అధికారులు గుర్తించింది రూ.1.10 కోట్లు. ఇదీ 'ఆడుదాం- ఆంధ్ర' లెక్క

అవినీతి అంతులేనంత!

ఉమ్మడి జిల్లాలో రూ.1.10 కోట్ల దుర్వినియోగం ● ముగిసిన విజిలెన్సు విచారణ



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం.. ఆంధ్ర' అన్నారు. అవినీతి క్రీడకు తెరతీశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.1.1 కోట్ల స్వాహాకు పథకం వేశారు. ఇదంతా విజిలెన్సు విచారణలో వెలుగు చూసినట్లు తెలిసింది. గతేడాది సార్వత్రి ఎన్నికలకు ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విజిలెన్సు విచారణకు ఆదేశించింది. తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో దాదాపు 10 మంది అధికారులు నగరి నియోజకవర్గం నుంచీ విచారణ మొదలు పెట్టి జిల్లా మొత్తం సమగ్రంగా పూర్తి చేశారు. క్రీడా పోటీలకు సంబంధించి పరికరాలు, టీ షర్టుల కొనుగోళ్లు, విజేతల ఎంపికలో అక్రమాలు, పబ్లిసిటీ కోసం ఆయా వస్తువులపై బ్రాండెడ్ స్టిక్కర్లు, క్రీడాకారులకు నాసిరకం కిట్లు సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిసింది. అలాగే, విజేతలుగా కూడా వైసీపీ కార్యకర్తలనే ఎంపిక చేసినట్లు అధికారులు గుర్తించారు. వివిధ క్రీడల కింద క్రీడాకారులు ఆటలు ఆడినట్లు లెక్కలు చూపించినట్లు సమాచారం. దీంతో పాటు జిల్లా క్రీడా సంఘాల నుంచి ఖర్చు చేసిన మొత్తం కూడా ఈ స్కాం కిందకు వస్తుందని టీడీపీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆ దిశగానూ విజిలెన్సు అధికారులు విచారించారు. ఇక, ముగింపు ఉత్సవాల సందర్భంగానూ నిధుల దుర్వినియోగంపైనా దృష్టి పెట్టారు. ఇలా అన్ని కోణాల్లో విచారించిన అధికారులు.. సుమారు రూ.1.10 కోట్లు దుర్వినియోగమైనట్లు నిగ్గు తేల్చినట్లు సమాచారం. కర్నూలు విజిలెన్సు విభాగం ద్వారా ప్రభుత్వానికి రెండు రోజుల్లో ఈ నివేదిక అందించనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత ప్రభుత్వం కేసులు నమోదు చేసే అవకాశాలున్నాయి.

'స్త్రీ శక్తి'కి 393 బస్సులు



తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'స్త్రీ శక్తి' పథకం కింద 393 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15వ తేది నుంచి ఈ ఉచిత ప్రయాణం అందుబాటులోకి రానుంది. మిగిలిన 524బస్సుల్లో ప్రయాణించాలంటే టిక్కెట్లు చెల్లించాలి. ఈ పథకానికి సంబంధించి తుది మార్గదర్శకాలతో సోమవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్, సిటీఆర్డినరీ బస్సులలో మహిళలకు ప్రయాణం ఉచితం అన్న సంగతి తెలిసిందే. వీటితో పోలిస్తే జిల్లా పరిధిలో తిరుమల, నాన్‌స్టాప్, అంతర్రాష్ట్ర సర్వీసులతో పాటు ఏసీ, లగ్జరీ, డీలక్స్ బస్సులే ఎక్కువగా ఉన్నాయి. కాగా, తుది మార్గదర్శకాలు జారీ అయిన క్రమంలో మహిళల ఉచిత ప్రయాణం అమలుకు ఆర్టీసీ అధికారులు సన్నాహకాలను మరింత ముమ్మరం చేశారు.

ఆర్టీసీ బస్సులు:917(సొంతం 723,అద్దెవి 194)

ఏసీ బస్సులు : 124

నాన్‌ఏసీ బస్సులు: 792

- వెన్నెల 2, ఇంద్ర 12, అమరావతి 10, గ్రీన్ సప్తగిరి(ఎలక్ట్రిక్ ఏసీ) 100
- స్టార్‌లైనర్ 2, సూపర్‌లగ్జరీ 49, అల్ట్రాడీలక్స్ 21, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ 298, ఎక్స్‌ప్రెస్ 100, మెట్రోఎక్స్‌ప్రెస్ 14, పల్లెవెలుగు 303, అల్ట్రాపల్లెవెలుగు 5
- ఇంటర్‌స్టేట్ ఎక్స్‌ప్రెస్ 9, పల్లెవెలుగు 4, నాన్‌స్టాప్ 24
- తిరుపతి-తిరుమల మధ్య 342 బస్సులు (సప్తగిరి ఎక్స్‌ప్రెస్, గ్రీన్ ఎలక్ట్రికల్ బస్సులు)నడుస్తున్నాయి. రోజుకు దాదాపు 1,600 ట్రిప్పులతో దాదాపు 45వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. టికెట్ల ద్వారా దాదాపు రూ. 80 లక్షల రాబడి వస్తోంది. ఇది జిల్లా రాబడిలో సగం కావడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డి కన్నుమూత



చెంచురెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూశారు. శ్రీకాళహస్తి మండలం ఎంపేడులో 1937 జూలై 1న ఆయన జన్మించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయం సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. బీఏ, బీఎల్ విద్యాభ్యాసం పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచీ కాంగ్రెస్ పార్టీలో పోరాట నాయకుడిగా పేరు పొందారు. 1978, 1983, 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున శ్రీకాళహస్తి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిచెందారు. 1985లో టీడీపీ తరఫున పోటీ చేసిన సత్రవాడ మునిరామయ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన రైల్వే కాంట్రాక్టరుగా ఉంటూ శాసనసభకు ఎన్నిక కావడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. 1987లో సత్రవాడ మునిరామయ్య ఎన్నిక రద్దవడంతో 1988లో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి కొండుగారి శ్రీరామమూర్తిపై చెంచురెడ్డి 4,419 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సుమారు 18నెలల పాటు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. సుదర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన ఆయన 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరారు. ఇటీవల వయసు మీదపడటంతో అనారోగ్యానికి గురయ్యారు. తిరుపతిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు భార్య సుభద్రమ్మ, కొడుకు మోహన్‌రెడ్డి, కుమార్తెలు చెంచులత, బాలమ్మ ఉన్నారు. బుధవారం ఇంటి వద్ద అంత్యక్రియలు జరిపేలా కుటుంబ సభ్యులు ప్రకటన విడుదల చేశారు. ఆయన మృతిపై కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైసీపీ నేత సిరాజ్‌బాషా, ముక్కంటి ఆలయ మాజీ పాలకమండలి మాజీ సభ్యుడు జయగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం శ్రీకాళహస్తి యూనిట్ అధ్యక్షుడు వెంకయ్య, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త దామోదర్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

మెగా డీఎస్సీ ఫలితాలొచ్చాయ్!

రెండు రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ

ఆపై కేటగిరి వారీగా తుది ఫలితాల వెల్లడి



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ సోమవారం రాత్రి విడుదల చేసింది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే దాదాపు 1478 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు జూన్ 5వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు చిత్తూరులో నాలుగు, చెన్నైలోని మరో నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 1478 పోస్టులకు 26,501మంది అభ్యర్థులు 45,221 దరఖాస్తులు పంపారు. సకాలంలో ఫీజు చెల్లించకపోవడం, నమోదులో లోపాలు, అర్హత లేకపోవడం, ఇతరత్రా కారణాలతో 2701 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా 23,500 మంది అభ్యర్థులు తేలారు. పరీక్షలు దగ్గపడే సమయానికి మరిన్ని కారణాలతో 2160 మంది అభ్యర్థులు పరీక్షలకు దూరం కాగా, చివరకు 21,340 మంది అభ్యర్థులు పరీక్షలకు అర్హత సాధించారు. ఇదిలా ఉండగా జూలై 3వ తేదీ వరకు సాగిన డీఎస్సీ పరీక్షల్లో 19,550 మంది హాజరయ్యారు. ప్రతి పరీక్ష అనంతరం రెండు రోజుల్లో 'కీ'ని విడుదల చేయగా, ఏడు రోజుల అనంతరం ఫైనల్ 'కీ' విడుద చేశారు. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో సోమవారం రాత్రి డీఎస్సీలో అభ్యర్థులు సాధించిన మార్కుల జాబితాను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అభ్యంతరాలు స్వీకరించేందుకు రెండు రోజులు గడువు ఇచ్చింది. ఈ ప్రక్రియ ముగియగానే కేటగిరి వారీగా మెగా డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేయనున్నారు.



విమానాశ్రయంలో నాదెండ్లకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే తదితరులు

చట్టం తన పని తాను చేసుకుపోతుంది

● వైసీపీ అరాచకాలపై మంత్రి నాదెండ్ల

రేణిగుంట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసినట్లు.. ఇప్పుడూ అరాచకాలు చేయాలనుకుంటే చట్టం తన పని తాను చేసుకుపోతుందని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అన్నమయ్య జిల్లా కోడూరులో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లేందుకు ఆయన సోమవారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, తిరుపతిలో వైసీపీ చేసిన అరాచకాలు ప్రజలందరికీ తెలుసన్నారు. దళిత యువకుడిపై దాడిని రాష్ట్రమంతా చూసిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు మంత్రికి స్వాగతం పలికారు.

టీటీడీ ట్రస్టులకు రూ.30.1 లక్షల విరాళం

తిరుమల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రస్టులకు సోమవారం రూ.30.10 లక్షలు విరాళంగా అందాయి. బెంగళూరుకు చెందిన చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ఎస్ఎస్‌వీఎల్ నరసింహ రాజు తరపున మోహన్ కుమార్ రెడ్డి తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి రూ.20 లక్షల విరాళం చెక్‌ను అందజేశారు. ఇందులో రూ.10 లక్షలు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు, మరో రూ.10 లక్షలు ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని దాత కోరారు. అలాగే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు కడప జిల్లా సీఆర్ అసోసియేట్స్ సంస్థ అధినేత చరణ్‌తేజ్ రూ.10.10లక్షలు విరాళంగా అందజేశారు.



టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం చెక్‌ను అందజేస్తున్న మోహన్ కుమార్ రెడ్డి

ఇటు రద్దీ.. అటు బోసిపోయి



శ్రీకాళహస్తిలో అర్జీదారులు

శ్రీకాళహస్తిలో ప్రత్యేక పీజీఆర్ఎస్‌కు ఎమ్మెల్యేతో పాటు కలెక్టరూ హాజరయ్యారు. దీంతో అక్కడ అర్జీదారుల రద్దీ ఎక్కువగా ఉంది. వీరంతా ఇటు రావడంతో కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌కు అర్జీదారుల తాకిడి తగ్గింది.



కలెక్టరేట్ వద్ద ఖాళీ కుర్చీలు

- 6లో

బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం అందజేసే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డు కోసం ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ వసంతబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శప్రాయమైన పనులు, జాతీయస్థాయి క్రీడలు, సంఘసేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్ లలిత కళలు.. ఇలా వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 18ఏళ్ల లోపు పిల్లలు ఈ అవార్డులకు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 83285 62595 నెంబరులో సంప్రదించాలని కోరారు.

స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికిగాను స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో కనీసం పదేళ్ల సర్వీస్ ఉన్న పీఈటీలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పాఠశాల విద్యాశాఖ ఈనెల 8వ తేదీన విడుదల చేసిన నియమ నిబంధనలను అనుసరించి ప్రతిభ ఆధారంగా నియామక ప్రక్రియ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు సమయం మించిన తర్వాత అందిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకునేది లేదని స్పష్టం చేశారు.

తుడా పరిపాలనాధికారిగా శైలజ

తిరుపతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పరిపాలనాధికారిగా డాక్టర్ ఎస్.శైలజ నియమితులయ్యారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా యాదమరిలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ నుంచి డెప్యుటేషన్‌పై మున్సిపల్ పాలనా శాఖకు బదిలీ చేస్తూ తుడా పరిపాలనాధికారిగా నియమించింది. సంబంధిత పోస్టులో ఆమె ప్రాథమికంగా ఏడాది పాటు కొనసాగనున్నారు. మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుమలలో 16న గోకులాష్టమి ఆస్థానం

● మరుసటి రోజు ఉట్లోత్సవం

తిరుమల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామిని సాక్షాత్తు ద్వాపరయుగపురుషుడైన శ్రీకృష్ణుడిగా స్మరించుకుని ఈనెల 16వ తేదీన శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా తిరుమలలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖ మండపంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంగారు సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామిని వేంచేపు చేసి నివేదినలు సమర్పిస్తారు. ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, కృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ద్వాదశారాధనం చేపడతారు. 17వ తేదీన తిరుమలలో ఉట్లోత్సవాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఈ ఉత్సవాన్ని తిలకించడానికి మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడవీధుల్లో విహరిస్తారు. ఆలయం ముందు యువకులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని ఉట్లను కొడతారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని 17వ తేదీన శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,628

తలనీలాలు సమర్పించినవారు: 30,505

గజరాజుకు రక్షణ ఏదీ?

● అంతరిస్తున్న అడవులతో ఆవాసాలకు దూరం

● నేడు ఏనుగుల దినోత్సవం



ఏనుగు బతికినా పదివేలే.. చనిపోయినా పదివేలే అంటారు. బతికితే గజరాజులా బతకాలని కూడా చెబుతారు. ఎందుకంటే ఏనుగు తెలివైన జంతువే కాదు. స్వేచ్ఛా జీవి కూడా.. సమూహంగా ఉంటూ నాయకత్వం చాటుకుంటుంది. కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న తోటి ఏనుగును ఇట్టే గుర్తు పడుతుంది. ప్రయాణించిన మార్గాన్ని ఎప్పటికీ మర్చిపోదు.. పిల్లలతో ఉన్నపుడు దాని దగ్గరకు వెళ్లాలంటే పులులు, సింహాలే వెనుకడుగేస్తాయి...ఇన్ని విశిష్ట లక్షణాలున్నఏనుగు ఆవాసానికి క్రమేపీ చోటు కరువవుతోంది. ఏనుగుల దినోత్సవం(మంగళవారం) సందర్భంగా ప్రత్యేక కథనం.

- మంగళం, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శేషాచల కొండల్లో వందకుపైగా ఏనుగులు ఉన్నట్లు ఫారెస్ట్ అధికారుల అంచనా. గత పదేళ్లలో తిరుపతి పరిసర అటవీప్రాంతాల్లో ప్రమాదవశాత్తూ నాలుగు చనిపోయాయి. కొన్నాళ్లుగా ఇక్కడి అటవీప్రాంతంలో ఆవాసానికి అనువైన పరిస్థితులు కొరవడుతున్నాయి. అడవులను నరికివేయడం, ఆక్రమించి వ్యవసాయం చేయడం, కొన్నిచోట్ల ఎర్రచందనం కోసం స్మగ్లర్లు అలజడి సృష్టించడం లాంటి కారణాలతో ఏనుగులు బయటకు వస్తున్నాయి. సమీపంలో నీరు,ఆహారం కోసం దాడులు చేస్తున్నాయి. పంటపొలాలను ధ్వంసం చేస్తున్నాయి. రైతులను నష్టపరుస్తున్నాయి. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీటిని తిరిగి అరణ్యమార్గం పట్టించడం అధికారులకు సవాలుగా మారుతోంది. ఈనేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను రప్పించింది. వీటి నిర్వహణపై ఇక్కడి సిబ్బందికి శిక్షణ కూడా ఇప్పించింది. పలమనేరు మండలంలో ప్రస్తుతం ఈ కుంకీలు తమ పనిని ప్రారంభించాయి. గుంపులుగా ఉన్న ఏనుగులను ఒడుపుగా అడవిలోని పంపేందుకు శ్రమిస్తున్నాయి..

ప్రత్యేక టాస్క్‌ఫోర్సు

ఏనుగుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్సును కూడా ఏర్పాటు చేసింది. ఇందులోఎఫ్ఆర్వో, డీఎఫ్‌వో పర్యవేక్షణలో పదిమంది సిబ్బంది, ఇద్దరు పరిశోధకులు, పనిచేస్తున్నారు. ఉనికి గుర్తించేందుకు జీపీఎస్, డ్రోన్లు, ట్రాప్ కెమెరాలు ఉపయోగిస్తున్నారు. వాటి ఆవాసాలను సంరక్షించడం, అడవుల్లో నీటితొట్టెలు ఏర్పాటుచేయడం, పంట పొలాలకు వచ్చినపుడు సురక్షితంగా తిరిగి మళ్లించడంలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల జాతీయ కమిటీ పర్యటించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించింది. కారిడార్ల ద్వారా ప్రత్యేక రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.



కీరమంద ప్రాంతానికి కుంకీలను తరలిస్తున్న మావటీలు

జూపార్కులోనూ ఉన్నాయోచ్

తిరుపతి ఎస్వీ జూపార్కులో ఐదు ఏనుగులను సంరక్షిస్తున్నారు. వీటిలో 3మగవి, రెండు ఆడవి. వీటికి రోజుకు రూ.2,350, వారానికి రూ.16,450, నెలకు రూ.70,500 ఖర్చు చేస్తున్నారు. వీటి సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలంటే దత్తత తీసుకునే అవకాశం ఉందని జూ అధికారులు చెబుతున్నారు.



నక్కలవారికండ్రిగ పేదలు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పేదలు సాగుచేసుకుంటున్న భూములను వారికే పంపిణీ చేయాలి

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

చిల్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నిరుపేద దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ మిగులు భూములను పేదలకే పంపిణీ చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం మండలంలోని నక్కలకాలవ కండ్రిగ వద్ద నిరుపేద దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ నెలబల్లిరెట్టపల్లి పంచాయతీలోని నక్కలకాలువ కండ్రిగ వద్ద ఉన్న సుమారు 45 ఎకరాల ప్రభుత్వ భూములను 22 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం కొందరు టీడీపీ నాయకులు నిరుపేదలపై అక్రమ కేసులు పెడుతూ భూములను అక్రమించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. ఆ భూములను పేదలకు కేటాయించే వరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, సీవీఆర్ కుమార్, నారాయణ, రమేష్, సునీల్, శ్రీనివాసమూర్తి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మా ఊర్లోనే పాఠశాల ఉండాలి

● తడ దళితవాడ విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్

తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తమ ఊర్లోనే పాఠశాలను కొనసాగించాలని తడ దళితవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాలను మూసివేసి అక్కడే ధర్నా చేపట్టారు. ఎంఈవో మల్లికార్జున్ పాఠశాల వద్దకు చేరుకొని తల్లిదండ్రులతో చర్చించారు. గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకువెళ్లారు. మా ఊర్లోనే పాఠశాలను కొనసాగించేలా చూడాలని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే డీఈవో కుమార్‌తో చర్చించారు. ఇందుకు ఆయన సానుకులంగా స్పందించారు. తడ దళితవాడ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి వరకు చదువుకునేలా విద్యాశాఖ అధికారులు అంగీకరించినట్లు తమకు హామీ లభించిందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ విషయమై ఇంత వరకు తగిన ఆదేశాలు రాలేదని, ఉన్నతాధికారుల సూచన ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో మల్లికార్జున్ చెప్పారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో మల్లికార్జునరావు

భానుప్రకాష్‌రెడ్డికి పలువురి పరామర్శ

తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నేత భానుప్రకాష్‌రెడ్డిని పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన తల్లి గుడుపల్లి అరుణమ్మ (80) ఆదివారం మృతిచెందిన విషయం విదితమే. సోమవారం పలువురు ప్రముఖులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళుర్పించారు. భానుప్రకాష్‌రెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఇందులో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి, చంద్రగిరి, నగరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, మురళి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణ్యం, బత్తుల చెంగల్రాయులు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, డీఆర్‌డీఓ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఏపీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, శాప్ చైర్మన్ రవినాయుడు, టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్రనారాయణ, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్, టీడీపీ నేతలు భువన్‌కుమార్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గోవిందధామంలో దహనక్రియలు నిర్వహించారు.



భానుప్రకాష్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్

డక్కిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డక్కిలిలో ప్రభుత్వాస్పత్రి ఎదురుగా నడుపుతున్న ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సోమవారం అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారిణి బిందుప్రియ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వంద మీటర్లు దూరం వరకు ఎలాంటి ప్రైవేట్ వైద్యశాలలు ఉండకూడదన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఏప్రిల్‌లోనే ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశామన్నారు. అయితే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు కావడంతో తరుపరి చర్యలు తీసుకోలేదన్నారు. హైకోర్టు ఆ కేసు కొట్టివేయడంతో ఈనెల 7న క్లినిక్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. గడవు ముగిసినా నిబంధనలు పాటించకపోవడంతో సోమవారం క్లినిక్‌ను మూసివేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో వెంకటగిరి సీఐ రమణ, డక్కిలి, బాలాయపల్లి ఎస్ఐలు శివశంకర్, కామినేని గోపి, వైద్యాధికారి శ్రీహరి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఎంపీ క్లినిక్ వద్ద అధికారులు





ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ - పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రజలు

శ్రీకాళహస్తిలో ప్రత్యేక పీజీఆర్ఎస్

హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్ ● 1,500పైగా వచ్చిన అర్జీలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకోసం ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో 1,500మందికి పైగా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చారు. ఆయా మండలాలకు సంబంధించి వేర్వేరుగా అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పీజీఆర్ఎస్ ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ఫిర్యాదులను స్వీకరించారు. అక్కడికక్కడే ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు 2వేలమందికి పైగా సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. అందులో 90శాతం రెవెన్యూ సమస్యలే ఉన్నాయన్నారు. చాలామంది కలెక్టరేట్‌కు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో తన విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించి ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి మూడు నెలలకోసారి ఇదే తరహాలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. చెంబేడు కాలువను శుభ్రం చేసేందుకు ప్రభుత్వం తరఫున కలెక్టర్ సహకరించాలని కోరారు. రేణిగుంట, ఏర్పేడు మండలాల నుంచి భూ సమస్యలు రాష్ట్రస్థాయిలోనే అత్యధికంగా నమోదవుతున్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా శ్రీకాళహస్తిలోనే ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. సెప్టెంబరు చివరి వారంలో మళ్లీ ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. విడతల వారీగా అన్ని సమస్యలు పరిష్కారమయ్యే వరకు గ్రీవెన్స్‌ను కొనసాగిస్తామన్నారు. డీఎస్పీ నరసింహమూర్తి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ భరత్‌రెడ్డి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యుత్, ఇరిగేషన్, హౌసింగ్, కార్మిక, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.





జలపాతాల కొండ

ఉండి ఉండీ దంచిపోస్తున్న వానలకు తిరుమల కొండల్లో జలపాతాలు ఉరికి దూకుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచే కపిలతీర్థం ఉధృతంగా ప్రవహిస్తుండగా, సోమవారం ఉదయానికి మాలాడగుండం కూడా జాలువారుతోంది. గరుడవారధి మీద తిరుమలకు ప్రయాణించే వాహనాల్లోని యాత్రీకులకు ఈ జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. కపిలతీర్థంకి జనం పోటెత్తి వస్తున్నారు. ఇక్కడ నిలిపేస్తున్న వాహనాలతో నంది సర్కిల్‌లో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలుగుతోంది. దివ్యారామం కొలను ముందు ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు. ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.







గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రశాంతంగా మున్సిపల్ సమావేశం



సమావేశమైన కౌన్సిలర్లు, అధికారులు

వెంకటగిరి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన సోమవారం జరిగింది. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ లాయర్ జయప్రకాష్‌ను తొలగించి కొత్త స్టాండింగ్ కౌన్సిల్‌ను నియమించాలన్న అంశాన్ని అజెండా నుంచి తొలగించాలని వైసీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్లకు మున్సిపాలిటీకి సంబంధించి రూ.50 లక్షలు బిల్లులు పెట్టారు. పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో నిర్వహణ ఏర్పాట్లకు అవసరమైన రూ.50 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఏడాది కూడా మున్సిపాలిటీకి సంబంధం లేకుండా జాతర ఏర్పాట్లకు అయ్యే ఖర్చును దేవదాయశాఖ భరించాలని ఆ శాఖకు లెటర్ పెట్టాలని కోరారు. అలాగే యోగాంధ్ర కార్యక్రమ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించకుండా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మున్సిపాలిటీపైకి నెట్టడమేంటని కమిషనర్‌ను కౌన్సిలర్లు ప్రశించారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి



సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మండలం కలపాడు గ్రామంలో పేదలు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములను వారికే పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెంకటగిరి మండలం కలపాడు గ్రామంలో సుమారు 110 మంది నిరుపేదలు ప్రభుత్వ భూములను సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ భూములను కొందరు ఆక్రమించుకుని పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేదలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెంగయ్య, శివకుమార్, బీవీ.రమణయ్య, చంద్రయ్య, చెంచుకృష్ణయ్య, బాలసుబ్రహ్మణ్యం, చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారం ఏర్పాటుపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న కోళ్లఫారంపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ హరికృష్ణకు టీడీపీ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించి కోళ్లఫారం ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. భూమి లెవలింగ్‌కు కూడా అక్రమంగా చెరువు మట్టిని తరలించారని, అలాగే కోళ్లఫారానికి వెళ్లేందుకు చెరువులో గ్రావెల్ రోడ్డు నిర్మించారని చెప్పారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని సెంటు ఆక్రమించినా సర్వే చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, దువ్వూరు రాకేష్‌రెడ్డి, మునీష్, లోకేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలరావు

దక్కిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల రావు అన్నారు. దక్కిలి వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం పీఎంఆర్‌కే వీవై పథకం ద్వారా రైతులకు పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో సమగ్ర యాజమాన్యం పద్ధతులు పాటిస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. అలాగే పురుగు మందుల స్థానంలో జీవ శిలీంద్ర నాశకాలు, లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు వినియోగించాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారిణి శిరీషా మాట్లాడుతూ పంటల బీమా గురించి వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దక్కిలి టీడీపీ పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు సునీల్ యాదవ్, వ్యవసాయశాఖ సహాయకుడు శ్రీనివాస్, ఏఈవో రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వద్దు



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వ హించారు. సామాన్యులకు భారంగా మారబోతున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలన్నారు. అదానీ సంస్థకు ప్రజాధనాన్ని కూడబెట్టేందుకు స్మార్ట్‌మీటర్ల ప్రక్రియను తీసుకువచ్చారన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివకుమార్, ప్రభాకర్, వెంకట్రామిరెడ్డి, బీవీ.రమణయ్య, శశికుమార్, సీవీఆర్.కుమార్, శంకరయ్య, శ్రీనివాసులు, ప్రసాద్, చంద్రయ్య, రమేష్, నారాయణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మన్నారు పోలూరు సబ్‌స్టేషన్ వద్ద స్థానికులు నిరసన తెలిపారు. సీపీఐ నియోజకవర్గ నాయకుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బిల్లులు అధికంగా వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా స్మార్ట్ మీటర్లు బిగించడం సరికాదన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెళ్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలను కర్రతో కదిలించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం మండల కేంద్రమైన పెళ్లకూరులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన మేరిమి సుధాకర్(29) ఇంట్లోకి విద్యుత్ సరఫరా సక్రమంగా రాకపోవడంతో కర్రతో స్థంభానికి ఉన్న వైర్లను కదిలించాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతం జరగడంతో సుధాకర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా, వెంటనే శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని తమిళనాడువాసి

తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని బైక్ ఢీకొని తమిళనాడు వవాసి మృతి చెందాడు. తమిళనాడులోని మాదరపాకం తాలుక అప్పాయిపాలెం గ్రామానికి చెందిన వీరయ్య(59) సోమవారం తడకు వచ్చాడు. తిరిగి వెళుతుండగా స్థానిక భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని బైక్ వేగంగా వీరయ్యను ఢీకొంది. 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన మోటారు సైకిలిస్టు పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఇటీవల బజారు వీధుల్లో ట్రాఫిక్ నియంత్రిస్తున్న పోలీసులు (ఫైల్‌ఫొటో) - సోమవారం నాడు ఆర్టీసీ బస్టాండు వద్ద నడి రోడ్డులోనే వాహనాలు

పట్టుమని పది రోజులే!

- యథావిధిగా రోడ్లపై వాహనాల పార్కింగ్
- పట్టణవాసులకు తప్పని ట్రాఫిక్ తిప్పలు

సూళ్లూరుపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఇటీవల సూళ్లూరుపేటలో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, సిబ్బంది లాఠీలు పట్టుకుని తిరిగి హడావిడి చేశారు. సీఐతో పాటు సూళ్లూరుపేట, తడ, శ్రీహరికోట ఎస్ఐలు బ్రహ్మనాయుడు, కొండపనాయుడు, స్వప్న, ఇతర సిబ్బంది జీఎన్‌టీ రోడ్డుతో పాటు ప్రధాన వీధులన్నీ తిరిగి రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన దుకాణాలుదారులను వెనక్కి పంపించారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండు, ఇతర ప్రాంతాల్లో రోడ్లకు అడ్డంగా పెట్టిన ఆటోలు, ఇతర వాహనదారులను హెచ్చరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇకపై పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే పట్టుమని పదిరోజులు కాకనే యథావిధిగా పట్టణవాసులకు ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. కొందరు వాహనదారులు మద్యం తాగి రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఆపడమే కాకుండా, ప్రశ్నించిన వారిని పరుష పదజాలంతో దూషిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో ఉన్న ట్రాఫిక్ పోలీసు సిబ్బంది నిబంధనలు పాటించని వాహనాల ఫొటోలు తీసి వాట్సప్‌లో పెట్టేసి పనైపోయిందన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోలేదు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రతిరోజూ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చూడాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం: పాశిం



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని బనిగిసాహెబ్‌పేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, ఉచితంగా గ్యాస్ సిలండర్లు పంపిణీ, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. ఈనెల 15నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేయనున్నట్లు చెప్పారు. సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా ఏడాది లోగా సీఎం చంద్రబాబు అమలు చేసి చూపారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణను తట్టుకోలేని వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు, విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, అల్లీహుస్సేన్, అబ్దుల్ రహీం, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, గురవయ్య, మోహన్, వాటంబేడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై డ్రోన్‌తో నిఘా

నాయుడుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలపై డ్రోన్‌తో నిఘా పెట్టి చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ చెంచుబాబు అన్నారు. సోమవారం పోలీసు సిబ్బందికి డ్రోన్ వినియోగంపై సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఐసోలేటెడ్ ప్రాంతాల్లో ఓపెన్ డ్రింకింగ్, ఈవ్‌టీజింగ్, గంజాయి తాగడం, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై డ్రోన్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందన్నారు. డీఎస్పీ వెంట అర్బన్ సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

సింగిల్ విండో అధ్యక్షుడికి సన్మానం



అంకయ్యను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ సింగిల్ విండో అధ్యక్షుడిగా నియమితులైన దారా అంకయ్యను సోమవారం నాయుడుపేటలోని ఆయన స్వగృహంలో టీడీపీ నాయకులు శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో గోను బాబు, ఉచ్చూరు వెంకటయ్య, ముసులూరు శ్రీనివాసులు, పాలేటి అంకయ్య, ముత్యాలుబాబు, సిద్ధార్థ, పసల సురేష్, ఈశ్వరయ్య, సతీష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ చైర్లు పంపిణీ

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా రమణయ్య, కారదర్శిగా రవిచంద్ర, కోశాధికారిగా వీరేంద్రనాథ్‌తో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మండలంలోని విందూరు పాఠశాల విద్యార్థులకు స్టడీ చైర్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ రియాజ్ అహ్మద్, భయ్యా రవికుమార్, రామ్మోహన్ రావు, కుమార్, ఆర్‌వీ.రావు, మురళీరెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, శీనయ్య, రూపేష్‌రెడ్డి, మస్తాన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

జీలగల పంపిణీ

కోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కోటలోని రైతు సేవాకేంద్రంలో సోమవారం రైతులకు సబ్సిడీపై జీలగ విత్తనాలను పంపిణీ చేశారు. =కార్యక్రమంలో ఏవో సుచేంద్రప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి సాయికుమార్, టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, మధుయాదవ్, శ్రీధర్‌రెడ్డి, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ఫ్రెషర్స్‌కు అవగాహన

కోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు, తల్లిదండ్రులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డితో పాటు ఆయా విభాగాధిపతులు కళాశాలలో ఉన్న కోర్సులు, అధునాతన సాంకేతిక విద్య, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

గ్రామోత్సవం

కోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరంలో గల శివకోటలో రెండు రోజులుగా జరుగుతున్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి విగ్రహప్రతిష్ఠలో భాగంగా సోమవారం కలశాలతో గ్రామోత్సవం జరిగింది. స్వామి, అమ్మవార్ల విగ్రహాలు, కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే తిన్నెలపూడి పంచాయతీ లక్ష్మక్కకండ్రిగలో గ్రామదేవత మాతమ్మ గ్రామోత్సవం నిర్వహించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో సోమవారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఇన్‌చార్జి అగ్నిమాపకశాఖ అధికారి విజయ్‌కుమార్ వివరాల మేరకు... స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో సిబ్బంది అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.



అగ్నిప్రమాదానికి గురైన దుకాణం

నేడు ఓజిలి మండల సమావేశం

ఓజిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

నిబంధనల ప్రకారమే హాస్టళ్లను నడపాలి

తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారమే పీజీ హాస్టళ్లను నడపాలని ఎస్ఐ కొండపనాయుడు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం తడలోని పలు పీజీ హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. వసతి పొందుతున్న ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లలో వసతి పొందుతున్న ప్రతి ఒక్కరి వివరాలు రిజిష్టర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహిళకు కుట్టుమిషన్ అందజేత

గూడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గమళ్లపాళెం ప్రాంతానికి చెందిన లక్ష్మి అనే మహిళకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దాతృత్వంతో కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో తీగల చంద్రశేఖర్, మోహన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ
డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పెళ్లకూరు మండలం, కొత్తూరు గ్రామానికి చెందిన సుధాకర్ ఆటోను నడుపుకుంటూ సోమవారం గూడూరుకు వెళ్తుండగా పండ్లూరు సమీపంలో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ వాహనంలో అతడిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి నాదెండ్లకు స్వాగతం



మంత్రి నాదెండ్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉయ్యాల ప్రవీణ్

నాయుడుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌కు జనసేన సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ రేణిగుంట విమానాశ్రమంలో స్వాగతం పలికారు. రైల్వే కోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి వెళ్లేందుకు విమానాశ్రమం చేరుకున్న మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఉయ్యాల ప్రవీణ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు.

తడ సొసైటీ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి



తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తడ సొసైటీ అధ్యక్షుడిగా టీడీపీ నాయకుడు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయనతో పాటు టీకే.రవి, కే.సుధాకర్‌ను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ముగ్గురిని టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి అభినందించారు.

వ్యాసరచన పోటీల్లో రోహిణి ప్రతిభ

నాయుడుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరులో జరిగిన జోనల్‌స్థాయి వ్యాసరచన పోటీల్లో నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.రోహిణి ప్రథమస్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదనశర్మ తెలిపారు. సోమవారం కళాశాల అధ్యాపకులు అభినందించారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేయండి

గూడూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రావు అన్నారు. సోమవారం డీ వార్మింగ్ డే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థుల్లో నులిపురుగులను నివారించేందుకు ప్రభుత్వం ఉచితంగా ఆల్‌బెండాజోల్ మాత్రలను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, సీడీపీవో మెహబూబీ, డాక్టర్ జ్యోతి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

14న ఇరకంకుప్పంవాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ

తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరకంకుప్పం గ్రామస్తులకు పూడికుప్పం గ్రామంలో ఈనెల 14న ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. ఇరకంకుప్పం గ్రామస్తులకు పూడికుప్పంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పట్టాల పంపిణీకి జిల్లా అధికారులు రంగం సిద్ధం చేసుకున్నారు. పది రోజుల క్రితం వీటిని పంపిణీ చేయాలని నిర్ణయించి, ఆమేరకు ఏర్పాట్లు చేయగా భారీ గాలి, వర్షం కురవడంతో ఆ కార్యక్రమం రద్దు అయ్యింది. ఈనెల 1న ఇరకం గ్రామంలో పర్యటించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఈనెల 15వ తేదీలోగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఆ మేరకు 14వ తేదీ గురువారం జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీల చేతులమీదుగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. తహసీల్దారు శరత్‌బాబు మాట్లాడుతూ మొత్తం 172 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామని చెప్పారు.

సింగిల్ విండో కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న సింగిల్ విండో అధ్యక్షుడు, డైరెక్టర్లు

కోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కోటలోని తిన్నెలపూడి సింగిల్ విండో కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా కొక్కుపాడు గ్రామానికి చెందిన పలగాటి భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లుగా వెంకన్నపాళెం గ్రామానికి చెందిన పనబాక కోటేశ్వరరావు, తిన్నెలపూడి గ్రామానికి చెందిన పుచ్చలపల్లి చిరంజీవులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో సీఈవో , టీడీపీ నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, చాపల శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

చిల్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతవరం, వల్లిపేడు గ్రామాల్లో సోమవారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతవరం, వల్లిపేడు వైద్యాధికారులు సుమ, దినేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పింక్ బస్సుల ద్వారా ఉచితంగా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను నిర్వహిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీకుమార్, నాగరాజ్, లలిత, శివశంకర్, పద్మావతి, చైతన్యభాను, వెంకటేశ్వర్లు, సాయిబాబా, ప్రకాష్, గోపాల్, హజరతయ్య, శాంతి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం: పాశిం



ఎడ్ల బండిపై ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే పాశిం, మాజీ మంత్రి పరసా

చిట్టమూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చెప్పారు. సోమవారం చిట్టమూరు సొసైటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే సునీల్ కుమార్, మాజీ మంత్రి పరసా రత్నంలకు టీడీపీ నాయకులు, రైతులు గజమాలతో స్వాగతం పలికారు. ఎడ్ల బండిపై ర్యాలీగా సొసైటీ కార్యాలయానికి తీసుకెళ్లారు. సొసైటీ చైర్మన్ కస్తూరయ్య, సభ్యులుగా వెంకటరమణయ్య, మోహనయ్య చేత ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. అనంతరం సునీల్ కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మద్యం విక్రయించడం వల్ల సుమారు 70 వేల మంది లివర్, కిడ్నీ, గుండె సంబంధిత రోగాలతో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఐదు పథకాలను అమలు పరిచామన్నారు. మండలంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 4,898 మంది రైతులకు రూ.3.37 కోట్లు అందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివకోటరెడ్డి, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మధురెడ్డి, సునీల్‌రెడ్డి, వాకాడు ఏఎంసీ చైర్మన్ దారా ప్రమీల, భారతమ్మ, హరికృష్ణారెడ్డి, చిన్నారావు, బాబు నాయుడు, గోపాల్ నాయుడు, రాజేష్ రెడ్డి, ఎన్‌ఆర్ఐ కృష్ణ, చెంచురామయ్య ఆచారి, అనురాధ, గిరి నాయుడు, రషీద్, బషీర్, కోట, వాకాడు టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సినిమాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి

వెంకటగిరి టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సినిమాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని సీఐ రమణ అన్నారు. సోమవారం పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో నాటకమే కదా జీవితమంతయా...' సినిమా ట్రైలర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై సినిమా తీయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దర్శకులు ఉపేంద్ర, ప్రకాష్, మహేష్, ప్రకాష్, సంజునాని, లియో తదితరులు పాల్గొన్నారు.



సినిమా ట్రైలర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ రమణ